జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 12 సంచిక 219 విశాఖపట్నం సోమవారం 26 ఏప్రిల్ 2021 8 పేజీలు వెల: 5.00



మాస్టర్ కీ TV (అంబేద్కర్ TV) ఛానల్

కావలెను

Senior Anchor
Graphic Designer
Sub-Editor
Marketing Manager

అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబర్లల్లో సంప్రదించగలరు

8886656884, 9948725373


## కరోనా నియంత్రణలో కలెక్టర్లదే కీలక పాత్ర:జగన్

### జిల్లా కలెక్టర్లకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం



అమరావతి,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా వైరస్ నియంత్రణలో కలెక్టర్లదే కీలక పాత్ర అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కలెక్టర్లు వ్యక్తిగతంగా కోవిడ్ ఆసుపత్రులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. జిల్లాలో శానిటైజేషన్ చేయడం, మాస్కులు ధరించడం సహా భౌతికదూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. 104కు కాల్ చేసే ప్రతి ఒక్కరూ సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోవిడ్ సంక్షోభంలో కలెక్టర్లు అత్యుత్తమ పనితీరు కనబర్చాలని తెలిపారు.

## దేశాన్ని మహమ్మారి ఉక్కిరిబిక్కిరి చేసింది:మోదీ

న్యూఢిల్లీ,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:కరోనా మహమ్మారి దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిందని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఇవాళ ఆలిండియా రేడియోలో మట్లాడిన ప్రధాని.. దేశంలో కరోనా విలయ తాండవంపై స్పందించారు. కరోనా వైరస్ మన సహనాన్ని, నొప్పిని భరించే శక్తిని పరీక్షిస్తున్న సమయంలో తాను మీతో మాట్లాడుతున్నానని ప్రధాని పేర్కొన్నారు.కరోనా మహమ్మారి కారణంగా మన ప్రియ బాంధవులెందరో మనల్ని విడిచి వెళ్లిపోయారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కరోనా మొదటి వేవ్‌ను విజయవంతంగా అణిచివేసిన తర్వాత జాతి స్థైర్యం, ఆత్మవిశ్వాసం పెరిగాయని, కానీ తుఫానుల విజృంభించిన సెకండ్ వేవ్ దేశాన్ని అతలాకుతలం చేసిందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మహమ్మారిని అరికట్టడం కోసం తాను ఫార్మా పరిశ్రమ, ఆక్సిజన్ ఉత్పత్తి రంగాలకు చెందిన పలువురు నిపుణులు సమావేశమై చర్చించానని ప్రధాని చెప్పారు. ప్రస్తుతం మన హెల్త్‌కేర్ సిబ్బంది, డాక్టర్లు కరోనా మహమ్మారి ప్రధాన యుద్ధం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది కాలంగా చేస్తున్న పోరాటంలో కరోనా మహమ్మారి వారికి పలు విధాల అనుభవాలను మిగిల్చిందని చెప్పారు.

**తప్పుడు సమాచారాన్ని నమ్మొద్దు**

కరోనా మహమ్మారికి సంబంధించి సోషల్ మీడియాలో కొందరు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని, అలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రజలు అస్సలు నమ్మవద్దని ప్రధాని సూచించారు. నమ్మకమైన ప్రసార మాధ్యమాల నుంచి మాత్రమే ప్రజలు కరోనాకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవాలని కోరారు. చాలా మంది వైద్యులు కూడా సోషల్ మీడియాలో కరోనా మహమ్మారికి సంబంధించిన సమాచారాన్ని ఇస్తున్నారని, కోరినవారికి ఉచితంగా సలహాలు, సూచనలు ఇస్తున్నారని ప్రధాని తెలిపారు. కరోనా మహమ్మారి కట్టడి కోసం రాష్ట్రాలు చేస్తున్న అన్ని రకాల ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందని ఆయన చెప్పారు.




## భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: కొవిడ్ మహమ్మారిపై భారత్ జరుపుతున్న పోరులో ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలుస్తామంటూ ప్రపంచ దేశాలు ముందుకు వస్తున్నాయి. ఈ మేరకు భారత ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయా దేశాలు వెల్లడించాయి. కరోనా రెండో దశ విజృంభణతో భారత్‌లో నెలకొన్న పరిస్థితుల పట్ల సానుభూతి వ్యక్తం చేసిన పలు దేశాలు వీలైన సాయం అందించడానికి కృషి చేస్తామని ప్రకటించాయి. ''భారత్‌లో పరిస్థితులు హృదయవిదారకంగా ఉన్నాయి. నా ఆలోచనలన్నీ భారత మిత్రులపైనే ఉన్నాయి. ఈ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కొనేలా భారత్‌కు సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. భారత ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం.

(మిగతా 2లో..)

## ఢిల్లీలో లాక్‌డౌన్ పొడిగింపు

న్యూఢిల్లీ,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్-19 మహమ్మారి విజృంభిస్తున్నందువల్ల ఢిల్లీలో లాక్‌డౌన్‌ను మరో వారం పాటు పొడిగిస్తున్నట్లు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశ రాజధాని నగరంలో కోవిడ్ మహమ్మారి తీవ్రంగా ఉందని చెప్పారు. ఈ మహమ్మారి మరింత వ్యాపించకుండా నిరోధించేందుకు మే 3 వరకు లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్లు తెలిపారు. అప్పటి వరకు ఆంక్షలు కొనసాగుతాయన్నారు. ఢిల్లీలో కోవిడ్-19 వేగంగా వ్యాపిస్తోందన్నారు. ఇంతకుముందు ఆరు రోజులపాటు విధించిన లాక్‌డౌన్ సోమవారం ఉదయం 5 గంటలతో ముగియవలసి ఉందని, కేసుల తీవ్రత దృష్ట్యా దీనిని మే 3 వరకు పొడిగిస్తున్నామని తెలిపారు.



కోవిడ్-19 మహమ్మారితో పోరాటంలో లాక్‌డౌన్ అనేది చిట్టచివరి అస్త్రమని చెప్పారు. ప్రస్తుతం పరిస్థితులు మెరుగుపడటం లేదన్నారు. అష్ట దిగ్బంధనాన్ని పొడిగించాలని చాలామంది సలహాలు ఇస్తున్నారని చెప్పారు. ఈ సలహాలను దృష్టిలో ఉంచుకుని, పరిస్థితులను సమీక్షించి మే 3 ఉదయం 5 గంటల వరకు అష్ట దిగ్బంధనాన్ని పొడిగించామన్నారు. ఢిల్లీ నగరంలోని ఆసుపత్రుల్లో ఆక్సిజన్ కొరత తీవ్రంగా ఉందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి.

## కరోనా.. ఏపీ సర్కార్ ప్రత్యేక ఆదేశాలు..

### సీటీ స్కాన్ ధర రూ.3 వేలుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: కోవిడ్ దృష్ట్యా సీటీ స్కాన్‌పై ఆస్పత్రులకు, ల్యాబ్‌లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. సీటీ స్కాన్ ధర రూ.3 వేలుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ హెచ్చరించింది. సీటీ స్కాన్, పాజిటివ్ వచ్చిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కోవిడ్-19 డాష్ బోర్డులో పాజిటివ్ వచ్చిన వారి వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.కాగా, కోవిడ్ రోగుల చికిత్సలను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 1.01 లక్షల మంది కోవిడ్ రోగులకు ఉచితంగా వైద్యసేవలను అందించింది. ఇందుకోసం ఏకంగా రూ.309.61 కోట్లను ఖర్చు చేసింది. గతేడాది ఏప్రిల్ నుంచి ఆరోగ్యశ్రీ కింద ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో కోవిడ్ రోగులకు ప్రభుత్వం ఉచిత చికిత్సలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ నెల 23 వరకు మొత్తం 1,01,387 మంది బాధితులు ఉచిత వైద్యం పొందారు.

## కరోనా బాధితులను వేధిస్తే సహించం: పెద్దిరెడ్డి

### కరోనా కట్టడిపై తిరుపతిలో మంత్రుల సమీక్ష
### అవసరాన్ని బట్టి కాలేజీలను కోవిడ్ ఆస్పత్రులుగా మారుస్తాం
### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి




తిరుపతి,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా కట్టడిపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి మంత్రులు నారాయణ స్వామి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. సమీక్ష అనంతరం మీడియాతో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ, కరోనా పేరుతో బాధితులను వేధిస్తే సహించమని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వైద్యం చేయాలని ఆయన స్పష్టం చేశారు.రెమిడెసివర్ ఇంజక్షన్లు బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఆక్సిజన్ స్టోరేజీపై ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. టెస్టులు చేసిన రోజే రిపోర్ట్ వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందు జాగ్రత్తగా అదనంగా వెంటిలేటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అవసరాన్ని బట్టి కాలేజీలను కోవిడ్ ఆస్పత్రులుగా మారుస్తామని మంత్రి పెద్దిరెడ్డి వెల్లడించారు.

## ప్రభుత్వాసుపత్రి సిబ్బందిపై మంత్రి సీరియస్

### దర్గామిట్ట ప్రభుత్వాస్పత్రిలో మంత్రి అనిల్ ఆకస్మిక తనిఖీ

నెల్లూరు,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: దర్గామిట్ట ప్రభుత్వాస్పత్రిలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బందిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కరోనా బాధితులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. శనివారం కూడా ఆసుపత్రుల్లో మంత్రి అనిల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.కోవిడ్ బాధితులకు మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని నారాయణ కోవిడ్ ఆసుపత్రి డాక్టర్లకు మంత్రి సూచించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. భోజన నాణ్యతపై ఆరా తీశారు. వైద్యం కోసం వచ్చే పేషెంట్లకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అడ్మిషన్లు జాప్యం చేయకుండా చూడాలని ఆస్పత్రి అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు, ఎక్స్‌రే, సీటీ స్కానింగ్ పరీక్షలు చేయాలని సూచించారు.






# అనుమతులు లేకపోయినా లక్షలు వసూళ్లు

**నిరుపేదలను పీక్కు తింటున్న ప్రైవేటు వైద్యశాలలు**
**పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం, వైద్య అధికారులు**



నరసరావుపేట, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట అధికా మొత్తంలో కరోనా ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై మరియు కరోనా కేసులు చూసే అనుమతులు లేకున్నా కరోనా కేసులు చూస్తూ లక్షల్లో ఫీజులు గుంజుతున్న ఆనుపత్రులపై చర్యలు తీసుకోవాలని నరసరావుపేట ఎం ఐ ఎం పార్టీ మరియు బీసీ సంఘం, మాల మహానాడు బి ఎస్ పి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆదివారం స్థానిక మార్కెట్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కోవిడ్ చికిత్సకు వసూలు చేయవలసిన ఫీజుల ధర నాన్ క్రిటికల్ కరోనా పెషేంట్ వద్ద వైద్యనికి రోజుకి 3.250. గా క్రిటికల్ కోవిడ్19 పేషంట్లకు ఐసీయూలో వెంటిలెటర్లు ఎన్ఐవి లేకుండా ఉంచితే రోజుకి 5.480. ఎన్ఐవితో ఐసీయూలో ఉంచి వైద్యం అందిస్తే రోజుకి 5.980.వెంటిలేటర్ పెట్టి వైద్యం అందిస్తే రోజుకి 9.580. ఇన్ఫెక్షన్ఉన్నవారికి వెంటలేటర్ లేకుండా వైద్యం అందిస్తే రోజుకి 6.280.ఇన్ఫెక్షన్ ఉండి వెంటిలేటర్ వైద్యం అందిస్తే రోజుకి 10.380 మాత్రమే వసూలు చేయాలనీ ప్రభుత్వం జీవో విడుదల చేసిన దానినీ బేఖాతారు చేస్తూ ప్రభుత్వం నిబంధనలు విరుద్ధంగా అధికఫీజులు వసూలు చేస్తూన్నారని అన్నారు. సామాన్య ప్రజలు ఉన్నా ఆస్తులు సైతం అమ్ముకొని హాస్పటల్స్ యాజమాన్యలకు కట్టే పరిస్థితి ఇప్పుడైన సంబంధిత అధికారులు కల్పించుకొని కరోనా బాధితులను కాపాడలని పార్టీ నాయకులు కోరారు ..ఈ కార్యక్రమం లో ఎం ఐ ఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి %ాఖ% మస్తాన్ వలి, పట్టణ అధ్యక్షుడు మౌలాలి, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోదా జాన్ పాల్, బి ఎస్ పి జిల్లా కో ఆర్డినటర్ బుదాల బాబురావు,బిసి సంగం నాయకులు కటారి శివరామకృష్ణ, మాలమహనా డు రాష్ట్ర మహిళ నాయకురాలు మల్లెల అనిల,జి మణిక్యరావు తదితరులున్నారు...

## కరోనా నివారణకు కారంపూడిలో సోడియం హైపోక్లోరైడ్ స్ప్రే కార్యక్రమం



కారంపూడి,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:కరోనా నివారణ చర్యలలో భాగంగా కారంపూడి సర్పంచ్ రామావతు. ప్రమీలభాయి తేజానాయక్ ఆధ్వర్యంలో ఆదివారం సోడియం హైపోక్లోరైడ్ స్ప్రే మందును గ్రామంలో స్ప్రే చేయటం మొదలుపెట్టినట్లు సర్పంచ్ తెలిపారు. దీనివలన కరోనా పురుగును నివారించవచ్చు అని అందుకోసమే గ్రామమంతా ట్రాక్టర్ ద్వారా అన్ని విధులలో స్ప్రే చేయించటం జరుగుతుంది అని సర్పంచ్ తెలిపారు. మొదటిగా నాగులేరు బ్రిడ్జి నుండి ఈ కార్యక్రమనికి శ్రీకారం చుట్టటం జరిగిందని సర్పంచ్ తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో అన్ని విధులలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసినట్లు సర్పంచ్ అన్నారు. గ్రామంలో అన్ని ప్రాంతాలలో మురికి కాలువలలో బ్లీచింగ్ చెల్లించటం జరుగుతుంది అని ప్రజలు కూడా తమ తమ పరిసరాలను శుభ్రపారుచుకొని పంచాయతీ వారికీ సహకరించాలని సర్పంచ్ కోరారు. అంతేకాకుండా కరోనా నివారణకు కృషిచేస్తున్న అధికారులకు మనం తోడ్పాటు అందించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రతిఒక్కరం అధికారులకు సహకరించి కరోనా కట్టడికి కృషి చేద్దామని ఈ సందర్భంగా సర్పంచ్ ప్రజలను కోరారు. ప్రతిఒక్కరూ మాస్క్ ధరించి సామజిక దూరన్ని పాటించాలని మాస్క్ లేకుండా బయట తిరిగితే ఉన్నంతధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది కూడా జరిమానా విధించవచ్చు అని ప్రజలు ఈ విషయాన్నీ గమనించి తప్పనిసరిగా మాస్క్ ధరించాలని సర్పంచ్ కోరారు.

## సైనికులవలె యుద్ధం చేస్తున్న వైద్య సిబ్బంది

**ఆసుపత్రిలో మంచాల కొరకు ఎదురుచూపులు,**
**నేలమీద పడుకుంటాం వైద్యం అందించండి**
**అంబులెన్సు లకు పెరిగిన గిరాకి, అద్దె అంబులెన్సు లోనే కరోనా చికిత్స**



మచిలీపట్నం బ్యూరో ఛీఫ్ 26(ప్రజాపాలన) : "కొవ్వొత్తి తాను కరిగిపోతూ తనచుట్టూ కాంతిని ప్రసాదిస్తూ ఉంటుంది" అ కాంతిలో అందరూ వెలుగును పొందుతారు కాని ఆకాంతిని ప్రసాదించిన కొవ్వొత్తిని ఎవ్వరూ పట్టించుకోరు. నేడు వైద్య సిబ్బందిని చూస్తుంటే అచ్చం అలానే అనిపిస్తుంది. రాత్రి పగలు తేడా లేకుండా సరిహద్దులోని సైనికులవలె కంటిమీద కునుకు లేకుండా తమ కుటుంబ సభ్యులను కూడా పట్టించుకోకుండా రోగులకు సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి ప్రజలు వందనాలు అర్పిస్తున్నారు. మరోవైపు స్థానిక మంత్రి పేర్ని నాని తన ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూడలేక స్వయంగా తాను మచిలీపట్నం లోని సెంట్రల్ మెడిసినల్ స్టోర్ కు వెళ్లి మచిలీపట్నం జిల్లా ఆసుపత్రికి అదనపు మంచాలు కేటాయించాలని కోరారు. మచిలీపట్నం జిల్లా ఆసుపత్రి స్థాయిని మించి రోగులు రోజురోజుకు రోగులు పెరిగిపోతున్నారు. వైద్య సహాయమే పరమావధిగా మంచాలు లేకున్నా నేలపై ఉన్నవారికి సైతం వైద్యం అందిస్తున్న ఏకైక ఆసుపత్రి మచిలీపట్నం జిల్లా ఆసుపత్రి. నిన్న విజయవాడ నుండి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు మొదట నిరాశ ఎదురయ్యింది. ఎటుచూసినా కరోనా రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రిలో మంచాలు దొరికే పరిస్థితి లేదు. వైద్యుల సలహా మేరకు రోగులకు అంబులెన్సు లోనే ఆక్సిజన్ అందిస్తూ వైద్య సహాయం చేసిన సిబ్బందికి ప్రజలు జే జే లు పలుకుతున్నారు.కరోనా రోగుల పట్ల మంత్రి చొరవ అభినందనీయం. మచిలీపట్నం జిల్లా ఆనువత్రి సెన్సస్ తెలుసుకుంటూ ప్రతి రోగికి వైద్యం అందించాలి అనే లక్ష్యంతో అడుగులు వేస్తున్న మంత్రి పేర్ని నాని, ప్రభుత్వ ఆసుపత్రి పై భారం తగ్గించేందుకు గాను పోలీసు సిబ్బంది కొరకు ప్రత్యేకంగా మచిలీపట్నం పోలీసు వేల్ఫేరు ఫంక్షను హాలును కోవిడ్ ఆసుపత్రిగా మార్చేందుకు జిల్లా ఎస్పి తో కలసి పరిశిలించారు.

## భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

సాయం చేసేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నాం" **– జెన్ సాకి, శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ**

"భారత్ మాకు గొప్ప భాగస్వామి. ఆ దేశానికి ఎలా సహాయపడగలం, ఏం చేయగలమో చూస్తున్నాం. వెంటిలేటర్లు, ఔషధాల వంటివి పంపే ప్రయత్నం చేస్తాం" **– బోరిస్ జాన్సన్– బ్రిటన్ ప్రధాని**

"కొవిడ్ రెండో దశ విజృంభణ నేపథ్యంలో భారత ప్రజలకు నా సంఘీభావాన్ని ప్రకటిస్తున్నా. మీరు చేస్తున్న పోరాటంలో ఫ్రాన్స్ అండగా ఉంది. ఏ రకమైనా సాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాం" **– ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు**

"కరోనాపై పోరాటం చేస్తున్న భారత మిత్రులకు నా సంఘీభావం. ఇతర దేశాలకు వ్యాక్సిన్లు పంపిన భారతదేశ దాతృత్వం, నాయకత్వం ప్రశంసనీయం. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఈ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత్‌తో కలిసి పనిచేస్తాం" **– మెరిన్ పేన్, ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి**

"భారత్‌లో కరోనా పరిస్థితిపై జర్మన్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటోంది. భారత్ మాకు వ్యూహాత్మక భాగస్వామి. అంతర్జాతీయ సహకారం ద్వారానే ఈ మహమ్మారిని సమర్థంగా ఎదుర్కోవాలన్న ప్రతిపాదనకు మేం కట్టుబడి ఉన్నాం. ఈ క్రమంలో జర్మనీకి చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ టాటాతో కలిసి భారత్‌కు 24 ఆక్సిజన్ ట్యాంకులను పంపనుంది" **– భారత్‌లోని జర్మనీ రాయబార కార్యాలయం**

"భారత్ అవసరాల మేరకు సాయం అందించడానికి మేం సిద్ధంగా ఉంది. భారతీయులు త్వరలోనే మహమ్మారిని ఓడిస్తారని విశ్వసిస్తున్నాం" **– ఝావో లిజియాన్, చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి**

## లయన్స్ క్లబ్ గుత్తి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

అనంతపురం, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:లయన్స్ క్లబ్ గుత్తి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం 27-04-2021 (మంగళవారం ) – విరూపాక్ష రెడ్డి కన్వెన్షన్ హాల్, అనంతపురం రోడ్డు, గుత్తి నగరంలో ఏర్పాటు చేయడమైనది. లయన్స్ క్లబ్ – గుత్తి , – పవన్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడమైనది. ఈ వైద్య శిబిరానికి కిమ్స్ సవేరా ఆధ్వర్యంలో గుండె, ఆర్థోపెడిక్రో, గైనకాలజి రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అనుభవం కలిగిన వైద్యులచే చికిత్స చేయబడును. జి.ఆర్.బి.ఎస్ , 2డి, ఇసిజి , బి.పీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేయబడును. హృద్రోగులు, ప్రసూతి, ఆర్థోపెడిక్ సమస్యలు ఉన్నవారు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరడమైనది. ప్రజా ఆరోగ్యాన్ని పటిష్ట పరచే విధంగా – అందరికి ఆరోగ్యం – అందరికి ఆనందం అనే నినాదం తో గుత్తి లయన్స్ క్లబ్ గత దశాబ్ద కాలం నుండి కంటి, న్యూరాలజి, నరాల బలహీనత, జనరల్ హెల్త్ చెక్ అప్ క్యాంపులు ఏర్పాటు చేయడమైనది. సమాజ సేవలో భాగంగా ఈ మంగళవారం గుండె, జనరల్ చెక్ అప్, ప్రసూతి మరియు ఎముకలు సంబంధించిన సమస్యలకు నిష్ణాతులైన వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు చేయబడును. స్థానిక విరూపాక్ష రెడ్డి కన్వెన్షన్ హాల్, అనంతపురం రోడ్డు, గుత్తి నందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం ఉంటుందని చార్టర్ ప్రెసిడెంట్ లయన్ విరూపాక్ష రెడ్డి, మక్బుల్, జిలాన్ ఖాన్, సంబంధ మూర్తి, చైతన్య, రుఖియా బేగం తెలిపారు.

## విశాఖకు చేరుకున్న 'ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్'



విశాఖపట్నం ఏప్రిల్ 25 ప్రజాపాలన ప్రతినిధి : దేశవ్యాప్తంగా కరోనా ప్రతాపాన్ని చూపిస్తోంది. రోజు రోజూకీ పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. మరో పక్క ఆస్పత్రిల్లో రోగులకు అవసరమైన పడకలు, ఇతర సౌకర్యాలు అందుబాటులో లేవు. ఔషధాలు, బెడ్స్ కొరతే కాదు ఆక్సిజన్ కూడా అందడం లేదు. ఈ తరుణంలో కేంద్రం ప్రభుత్వం 'ఆక్సిజన్ ప్రణాళిక' వేసింది. భారత రైల్వే ద్వారా ఆక్సిజన్ ట్యాంకర్లను రాష్ట్రాలకు సరఫరా చేయాని నిర్ణయించింది. ఇందులో భాగంగానే విశాఖ ఉక్కు కర్మాగారంలో ఆక్సిజన్ ఉత్పత్తిని పెంచాలని ఆదేశాలిచ్చింది. విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి మహారాష్ట్రకు ద్రవ ఆక్సిజన్‌ను తీసుకెళ్లేందుకు మొదటి 'ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్' రైలు విశాఖపట్నంకు చేరుకుంది. ఈ గూడ్స్ రైలుకు మార్గమధ్యంలో ఎటువంటి అటంకాలు ఎదురుకాకుండా రైల్వే శాఖ ప్రత్యేక ప్రణాళికలు చేసింది. సాయుధ దళాలు బందోబస్తుగా ఉంటున్నాయి. మహారాష్ట్ర నుంచి మొదటి 'ఆక్సిజన్ ఎక్స్‌ప్రెస్' సోమవారం సాయంత్రం కలంబోలి యార్డ్ నుంచి ఏపీలోని విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు బయలుదేరింది. ట్యాంకర్లను వ్యాగన్లల్లో ఎక్కించడానికి, దింపడానికి వీలుగా ముంబ్కె డివిజన్ కలంబోలి గూడ్స్ యార్డ్ వద్ద ర్యాంప్ కూడా నిర్మించారు. ఈ రైలు వాసై రోడ్, జల్గావ్, నాగ్‌పూర్, రాయ్ పూర్ కూడలి మీదుగా విశాఖ స్టీల్ ప్లాంట్ వరకు చేరుకుంది. గురువారం లిక్విడ్ ఆక్సిజన్‌ను నింపిన వెంటనే మరలా మహారాష్ట్రకు బయలుదేరనుంది.

## సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరనున్నాయ్..

హైదరాబాద్/అమీర్‌పేట : ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న సనత్‌నగర్ నియోజకవర్గ ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఎస్ఆర్‌నగర్‌లోని పోలీస్‌స్టేషన్ సమీపం, బల్కంపేటకు వెళ్లే ప్రధాన రహదారి, రోడ్లు భవనాల శాఖ కార్యాలయం ఎదురుగా రూ. 3.78 కోట్లతో 1,250 అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్తులలో ఏరియా ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తై ప్రారంభానికి సిద్ధమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 30 పడకల ఆస్పత్రిని మంజూరు చేయగా, నిధుల లేమితో నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. అనంతరం సనత్‌నగర్ ఎమ్మెల్యేగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ గెలవడం, టీఆర్ఎస్ ప్రభుత్వంలో చేరడం, వెంటనే మంత్రి పదవి రావడం జరిగింది. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తలసాని నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించారు. అందులో భాగంగానే అమీర్‌పేటలో నిధులలేమితో నిలిచిపోయిన ఏరియా ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి సారించారు. అసంపూర్తిగా ఉన్న 30 పడకల ఆస్పత్రి భవనాన్ని నాటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి మంత్రి తలసాని సందర్శించిన అనంతరం 30 నుంచి 50 పడకలకు పెంచుతూ ప్రభుత్వ అనుమతులు, నిధులు మంజూరు చేయించారు. గత సంవత్సరమే అందుబాటులోకి రావాల్సిన ఆస్పత్రి లాక్‌డౌన్ కారణంగా పనులు నిలిచిపోయాయి. గత నెలలో ప్రస్తుత వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ సందర్శించి పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులపై తగ్గనున్న ఒత్తిడి

అమీర్‌పేట డివిజన్‌లో ఆధునిక హంగులు, అధునాతన సదుపాయాలతో సువిశాల స్థలంలో ఏర్పాటు చేసిన 50 పడకల ఆస్పత్రి త్వరలో అందుబాటులోకి రానుంది. దీంతో నిత్యం రోగులతో కిక్కిరిసిపోయే గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులపై కొద్దిమేర ఒత్తిడి తగ్గనుంది. ప్రధానంగా గర్భిణులకు ప్రసవాలు చేసే సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. సనత్‌నగర్ నియోజకవర్గంతోపాటు, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, శ్రీనగర్‌కాలనీ, తదితర ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి.

# 73వ రోజుకు చేరిన రిలేనిరాహార దీక్షలు






విశాఖపట్నం ఏప్రిల్ 25 ప్రజాపాలన ప్రతినిధి : కూర్మనపాలెం టౌన్ షిప్ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద 73 వ రోజు రిలే నిరాహార దీక్షలను విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో కన్వీనర్ కె, సత్యనారాయణగారు, ప్రారంభించారు. దీనిలో విశాఖ నగరం నుంచి వివిధ ప్రభుత్వరంగ పరిశ్రమల కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. ఈరోజు ప్రధానంగా మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ బండి సంజయ్ మాదిగ ఆధ్వర్యంలో ఈనెల 17 వ తారీకు 30 మంది స్వచ్ఛంద కార్యకర్తలు తో తుమ్మలపల్లి వారి కళా క్షేత్రం విజయవాడ నుంచి ఉదయం 10 గంటలకు బయలుదేరి హనుమాన్ జంక్షన్ ,ఏలూరు, తాడేపల్లిగూడెం ,తణుకు, రావులపాలెం ,మండపేట, రామచంద్రపురం ,కాకినాడ, పిఠాపురం ,కత్తిపూడి, తుని, పాయకరావుపేట, ఎలమంచిలి, అనకాపల్లి ప్రాంతాల మీదుగా తమ ప్రయాణాన్ని కొనసాగించామని ఆయన తెలియజేశారు. ఆ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి విశాఖ ఉక్కు పై కేంద్రం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించాలని ఆయన ప్రజలకు వివరించారు. ఈ సైకిల్ యాత్ర యొక్క ప్రధాన లక్ష్యం దేశంలో రిజర్వేషన్లు ఎత్తేస్తే ప్రజల్లో పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తుందన్న భయంతోనే కేంద్ర ప్రభుత్వం ఆలోచనలో భాగవే ఈ ప్రైవేటీకరణ జరుగుతోందని ఆయన అన్నారు. ఈ పోరాటాల ద్వారా బహుజనులు నెలకొన్న అస్తిత్వాన్ని తొలగించి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడం కోనమే ఈ సైకిల్ యాత్ర అ ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. దేశంలో ప్రభుత్వ రంగవే లేకపోతే భవిష్యత్తులో దేశంలో బహుజనుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు.ఆంధ్ర ప్రదేశ్ కాంట్రాక్ట %ు% అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జాయింట్ ఏక్షన్ కమిటీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనూ దేశంలోనూ విద్యావంతులైన నిరుద్యోగులు కాంట్రాక్ట్ బేసిక్ లోనూ లేదా అవుట్సోర్సింగ్ విధానాలతో ఉపాధి పొందుతున్నరని ఆయన అన్నారు. వీరిని ఉద్యోగులుగా గుర్తించరు పని భారాన్ని పెంచి బానిసల కంటే హీనంగా చూస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చిన్న అవకాశాన్ని కూడా తీసివేసి దేశాన్ని మొత్తం కార్పొరేట్ల చేతుల్లో పెట్టడమే బిజెపి ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు. ఆత్మ గౌరవం కోసం జరుగుతున్న ఈ ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ బలపర్చాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి ఎం రమేష్, కందుకూరి రాజు తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షులు, తాతపూడి వీరరాజు తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షులు, మోర్త తాతారావు రాష్ట్ర కార్యదర్శి ఈ సైకిల్ యాత్రలో నాయకత్వం వహించారు. వీరు ప్రసంగినస్తూ విశాఖ ఉక్కు కాపాడుకోవడం ద్వారా బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కాపాడిన వారిగా సమాజం గుర్తిస్తుందని వారు అన్నారు. దీనిలో 30 మంది యువకులు పాల్గొన్నారు.విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు శ్రీ డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ కో కన్వీనర్ కె. సత్యనారాయణ సభ్యులు వైటి దాస్ ,గణపతి రెడ్డి ,సంపూర్ణం వరసాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సైకిల్ యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని అభినందించారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ప్రజల హక్కులపైన జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా ఈ ఉద్యమాన్ని చేస్తున్నామని వారు వివరించారు. దీనికి సంఘీభావంగా మీరందరూ కదిలి రావడం శుభసూచకమని వారు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో చలనం కలిగి తన విధానాలను మార్చుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## కరోనా మృతుడికి కార్పొరేటర్ లచ్చిరెడ్డి అంత్యక్రియలు

హైదరాబాద్/వనస్థలిపురం : కరోనాతో మృతి చెందిన ఓ నిరుపేద వ్యక్తికి బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాసరావు(45), పద్మావతి కుటుంబ సభ్యులు వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి సంతానం లేదు. వారం క్రితం శ్రీనివాసరావుకు కరోనా రావడంతో హోంక్వారంటైన్‌లో ఉన్నాడు. భార్య పద్మావతికీ పాజిటివ్ వచ్చింది. పేదరికం వల్ల వైద్యం చేయించుకోలేకపోయారు. రెండ్రోజుల నుంచి బయటిక రాకపోవటంతో స్థానికులు కార్పొరేటర్ లచ్చిరెడ్డికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వచ్చిన కార్పొరేటర్ శ్రీనివాసరావు మృతి చెందినట్లు గుర్తించారు. కళ్లముందే భర్త చనిపోవడంతో పద్మావతి కోమాలోకి వెళ్లింది. వైద్య కోసం పద్మావతిని వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, మృతదేహాన్ని సాహెబ్‌నగర్ శ్మశానవాటికకు తరలించ అంత్యక్రియలను కార్పొరేటర్ నిర్వహించారు.

# జిల్లా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసిన నిందితులు అరెస్ట్

మంచిర్యల, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:జిల్లా కలెక్టర్ సంతకం ఫోర్జరీ చేసి రూ. 1,97,46,151 లను కొల్లగొట్టాలని ప్రయత్నం చేసిన రాంనగర్ మంచిర్యాల కు చెందిన తాళ్లపల్లి రాజు,మేడిపల్లి జీవన్ , ఏ-జోన్ రామకృష్ణాపూర్ , మంచిర్యాలకు చెందిన తాళ్లపల్లి శ్రీనివాస్ ఆదివారం అరెస్టు చేశారు. ఈ మేరకు మంచిర్యల ఎసిపి అఖిల్ మహాజన్ నేరము కు సంబంధించిన వివరాలు మీడియా కు వివరించారు.వివరాల్లోకి వెళ్తే... ఎసిపి తెలిపిన వివరాల ప్రకారం..నిందితుడు తాళ్లపల్లి రాజు గతంలో టిఎస్ యండి సి యందు లారీలకు స్లాట్ బుక్ చేస్తుండేవాడు. ఈ క్రమంలో లో అతను తరచుగా అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ ఆఫీస్ కి వెళ్లేవాడు. అలాగే అతని అన్న తాళ్లపల్లి శ్రీనివాస్ కూడా ఏడి మైనింగ్ ఆఫీస్ లోనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేసేవాడు. గత కొన్ని నెలలుగా జిల్లాలో సాండ్ టాక్సీ నడుస్తుండడం దానిలో కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వ ఖజానాకు జమ అవుతుండడం వీరు గమనించారు. అలాగే దీని చెక్కులు తయారీ చేయడం, బ్యాంక్ ఎకౌంట్ మెయింటెన్ చేయడం, డబ్బులు విత్ డ్రా చేసే పొసెస్ ను రాయాలిటీ ఇంన్స్ పెక్టర్ లతో పాటు అప్పుడప్పుడు నిందితుని అన్న అయిన తాళ్లపల్లి శ్రీనివాస్ చూసుకునేవాడు. ఫిబ్రవరి రెండో వారంలో చెన్నూరు ఏరియా కు సంబంధించిన ఒక సాండ్ మైనింగ్ పర్మిషన్ గురించి వివరాలు తెలుసుకొనుటకు నిందితుడు రాజు ఏడి మైనింగ్ ని కలిసిన సందర్భంలో అతనితో గొడవ పడడం జరిగినది. అదేవిధంగా మైనింగ్ ఎడి ఆఫీస్ లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అతని అన్న తాళ్లపల్లి శ్రీను సాండ్ టాక్సీ ట్రాక్టర్ ల విషయంలో లో అక్రమాలకు పాల్పడుతుండటంతో అతనిని ఉద్యోగం నుండి తొలగించడం కోసం మైనింగ్ ఏ.డి. ప్రయత్నం చేసినారు. ఈ క్రమంలో లో అన్న దమ్ములు ఇద్దరు ఏరోజైనా తాము ఈ మైనింగ్ డిపార్ట్మెంట్ నుంచి దూరంగా జరగాల్సి ఉందని భావించి, శాండ్ టాక్సీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు జమ అవుతున్న కోట్ల రూపాయలను కొల్లగొట్టాలని అందువల్ల తాము లాభపడటం తోపాటు, ఏ.డి. మైనింగ్ కు చెడ్డపేరు వచ్చి అతని ని బదిలీ చేస్తారని భావించి అందుకోసం ఆఫీసు చెక్ బుక్ ను దొంగిలించి దానిద్వారా, ఆ చెక్కులను బ్యాంకులో డిపాజిట్ చేసి డబ్బులు స్వాహా చేయాలని పథకం వేశారు. ఈ క్రమంలో లో ఫిబ్రవరి నెల చివరి వారంలో ఏ.డి. మైనింగ్ ఆఫీస్ వారు ఐసిఐసిఐ బ్యాంకు ద్వారా కొత్త చెక్ బుక్ ల కోసం రిక్వెస్ట్ పెట్టిన విషయం తన అన్న ద్వారా తెలుసుకొని అవి డెలివరీ కొరియర్ లో వస్తాయన్న సమాచారం మేరకు నిందితుడు మార్చి మొదటి వారంలో తరచుగా కొరియర్ ఆఫీస్ కు వెళ్ళినాడు. అతను అమెజాన్ యందు రిటైల్ సెల్లర్ గా పనిచేస్తుండటంతో సరకులు డెలివరీ చేయడం కోసం తరచుగా ఆ కొరియర్ ఆఫీస్ కి వెళ్తుండటం తో అక్కడ ఉద్యోగస్తుల తో అతనికి చనువు ఏర్పడినది. దీనితో 9 మార్చి 2021 రోజు డెలివరీ ఆఫీస్ వెళ్ళినప్పుడు సాండ్ మనజేమెంట్ కి సంబందించిన బ్యాంక్ చెక్ బుక్ పార్సెల్ కనబడగా, నిందితుడు తాను అదే ఆఫీస్ కి వెళ్తున్నానని అని, ఆ పార్సల్ ని డెలివరీ చేసి, మీకు ఓటిపి చెప్తానని చెప్పి ఆ పార్సల్ తీసుకొని నేరుగా తన ఇంటికి వెళ్లి తన మిత్రుడు జీవన్ తో కలిసి ఆ పార్సల్ ఓపెన్ చేసి దానిలో ఉన్న 5 చెక్ బుక్ లలో ఒక చెక్ బుక్ తీసి, మిగతా నాలుగు చెక్ బుక్ లను అందులోనే ఉంచి మరలా పార్సల్ చేసి ఎ.డి. మైనింగ్ ఆఫీస్ లో అప్పగించాడు. ఎ.డి. మైనింగ్ ఆఫీస్ యందు ఉద్యోగి తన పని వత్తిడిలో ఈ పార్సెల్ ఓపెన్ చేసినది గాని అలాగే అందులో నుండి ఒక చెక్ బుక్ ను దొంగతనం చేసింది గాని గమనించలేదు. నిందితుడు మిగతా ఇద్దరితో కలిసి తాము దొరకకుండా ఉండేందుకు అన్ని రకాలుగా ఆలోచించి మొదట మహారాష్ట్రలోని చంద్రాపూర్ యందు అకౌంట్ ఓపెన్ చేయడానికి నిర్ణయించుకుని, అక్కడ ఉన్న తన మిత్రుని ద్వారా తనకు అమెజాన్ ద్వారా వస్తున్న మొత్తానికి పెద్ద మొత్తంలో ఆదాయపన్ను పడుతుందని అందుకని ఇంకొక అకౌంట్ ఉంటే మంచిదని ఎవరైనా ఉంటే వారి పేరు మీద అకౌంట్ ఓపెన్ చేసుకుంటానని అందుకుగాను మొత్తం ఖర్చు తానే భరిస్తానని , 50 వేల రూపాయలు ఇస్తానని చెప్పగ, అతని మిత్రుడు పది రోజుల సమయం తీసుకొని లలితా పాయల్ బంకర్ అనే ఆమెను ఒప్పించాడు. ఇదే సమయంలో లో అకౌంట్ కోసం లింకు ఫోన్ నెంబర్ అవసరం ఉంటుంది కాబట్టి నిందితుడు జగిత్యాల లో ఉన్న ఒక మిత్రుని ద్వారా చిత్తూరు కు సంబంధించిన ఒక వ్యక్తి యొక్క ఆధార్ కార్డుతో ఒక సిమ్ నెంబర్ తీసుకున్నాడు. ఈ ఫోన్ నెంబర్ ను ఇచ్చి చంద్రపూర్ యందు యాక్సిస్ బ్యాంకులో లలితా పాయల్ బంకర్ పేరుమీద ఒక ఎకౌంటు ఓపెన్ చేసి దానికి చెక్ బుక్ తీసుకుని ఆ చెక్ బుక్ పై ఆమె సంతకాలు తీసుకుని మంచిర్యాలకు వచ్చినాడు. అనంతరం నిందితుడు జిల్లా కలెక్టర్ మరియు ఎడి మైనింగ్ యొక్క స్టాంపులు తయారు చేయించారు. అలాగే జిల్లా కలెక్టర్ , ఏ.డి. మైనింగ్ యొక్క సంతకాలను తన అన్న ద్వారా సేకరించి, జీవన్ ద్వారా వాటిని ప్రాక్టీస్ చేయించాడు. అన్ని రకాలుగా తాము ఏ రకంగా పట్టుబడే అవకాశం లేదని నిర్ధారణ చేసుకొని జిల్లా కలెక్టర్ మరియు ఏ.డి. సంతకాలను జీవన్ ఫోర్జరీ చేసి 1,97,46,151 రూపాయలకు లలితా పాయల్ బంకర్ పేరుమీద ఒక చెక్కు తయారు చేసి దానిని తన అన్నద్వారా 16.04.2021 రోజు ట్రాక్టర్ ఓనర్స్ పేమెంట్ ద్వారా సుమారు 3.5 కోట్ల రూపాయలను కలెక్టర్ అప్రూవ్ చేసి చెక్ ఇష్యూ చేస్తున్నారని దానిని 17.04.2021 రోజు ఏ.డి. బ్యాంకర్స్ ప్రెసెంట్ చేస్తున్నారని అదే సమయం లో మనం చెక్ వేస్తే ఎటువంటి ఎంక్వయిరీ లేకుండా దానితో పాటు మనం వేసే చెక్ కూడా అప్రూవ్ అవుతుందని చెప్పగా తన అన్న సలహా మేరకు తేదీ 17.04.2021 రోజు కరీంనగర్ యాక్సిస్ బ్యాంక్ యందు జీవన్ డిపాజిట్ చేయడం జరిగింది. అయితే అది పెద్ద మొత్తం కావడం తో ఆక్సిస్ బ్యాంకు వారు నిందితునికి ఫోన్ చేసి అతన్ని వ్యక్తిగతంగా కరీంనగర్ బ్రాంచ్ కి రమ్మని కోరడం జరిగింది అలాగే వారు ఎ.డి. మైనింగ్ ఎకౌంటు, వున్న ఐసిఐసి బ్యాంక్ మంచిర్యాల కు కన్ఫర్మేషన్ కోసం అడగడం జరిగింది. సాధారణంగా ఏ.డి. మైనింగ్ గారు చెక్కులను సంస్థల పేరుమీదుగాని లేదంటే గ్రామ పంచాయతీలకు కానీ ఇస్తుంటారు. అయితే ఈ చెక్ పెద్ద మొత్తంలో ఉండడం వ్యక్తిగతంగా ఇవ్వడంతో వారికి అనుమానం వచ్చి మైనింగ్ ఆఫీస్ వారిని ఎంక్వయిరీ చేయడంతో వారు ఆ నెంబర్ తో తాము ఎటువంటి చెక్ ఇవ్వలేదని చెప్పి, బ్యాంకు నుండి సమాచారం తీసుకొని జరిగిన మోసం పైన మంచిర్యాల పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా, దాని పైన కేసు నమోదు చేసి పూర్తిగా శాస్త్రీయ పద్ధతులలో విచారణ చేసి నిందితులను గుర్తించి ఈరోజు ఉదయం వారిని అరెస్టు చేయడం జరిగినదని ఎసిపి తెలిపారు.






**సీజ్ చేసిన ప్రాపర్టీ వివరములు**

నిందితుల వద్ద నుండి వారు దొంగిలించిన ఎ.డి. మైనింగ్ ఆఫీస్ కు సంబంధించిన ఐసిఐసిఐ బ్యాంక్ చెక్ బుక్, ఆ డబ్బులు డ్రా చేసుకోవడానికి వారు చంద్రాపూర్ యాక్సిస్ బ్యాంకు నందు ఓపెన్ చేసిన అకౌంట్ బుక్ మరియు చెక్ బుక్, స్టాంపు ప్యాడ్, జిల్లా కలెక్టర్ మరియు ఏ. డి. గారి సంతకాల కాపీలు, పెన్నులు,పథకం రూపొందించటానికి వాడిన వారి ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన వివరించారు.

## విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా విలయ తాండవం



విజయవాడ: కరోనా చావు బతుకుల పోరాటంగా మారింది. వైరస్ బారిన పడి ఊపిరాడక బాధితులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ప్రాణవాయువు కోసం ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఆస్పత్రుల్లో సరిపడా ఆక్సిజన్ నిల్వలు లేకపోవడంతో పాటు బెడ్లు కూడా లభించకపోవడంతో రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. విజయవాడ కొత్త ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా విలయ తాండవం చేస్తోంది. ఆక్సిజన్, బెడ్ల కొరతతో కరోనా రోగుల తీవ్ర అవస్థలు పడుతున్నారు. బెడ్ల కోసం ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రులతో రికమండేషన్లు చేస్తున్నా.. బెడ్లు దొరకడం లేదు. చికిత్స పొందుతున్న రోగి చనిపోతేనే బెడ్ ఖాళీ అయ్యే పరిస్థితి ఉంది.రోజుకు వందల సంఖ్యలో ప్రభుత్వాస్పత్రికి కరోనా పేషెంట్లు వస్తున్నారు. సాధారణ రోగులను వైద్యులు గుంటూరుకు తరలిస్తున్నారు. ఓపీలు రద్దు, అయినా విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రిలో రద్దీ ఆగలేదు. ప్రస్తుతం సామాన్యుల నుంచి విఐపీల వరకు "ఒక్క బెడ్డు ప్లీజ్" అంటూ ప్రాధేయపడుతున్నారు. ప్రభుత్వం 3గంటల్లోనే బెడ్లు కేటాయిస్తామని ప్రకటిస్తున్నా, ఆచరణలో మాత్రం సాధ్యపడటం లేదన్న విమర్శలొస్తున్నాయి. మరోవైపు కరోనా సోకి మరణించిన వారి మృతదేహాలతో మార్చురీలు నిండిపోవడంతో వాటిని వార్డుల్లోని బెడ్లపైనే వదిలేస్తున్నారు.

## మాల మహానాడు రిజిస్ట్రేషన్ నెంబర్ 972 ను ఉపయోగించవద్దు:కుసుమ మధుసూదన్



బెల్లంపల్లి మార్చి 25 ప్రజా పాలన ప్రతినిధి:జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు కారెం శివాజీ నిర్వహించినటువంటి తెలంగాణ మహానాడు రిజిస్ట్రేషన్ నెంబర్ 972 పసుల రామ్మూర్తి ఉపయోగించుకో వద్దని తెలంగా%శీ%ణ మాల మహానాడు రాష్ట్రదర్శి కుసుమ మధుసూదన్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుల రామ్మూర్తి నర్సింహయ్య గారి ఆధ్వర్యంలో నడుస్తున్న 972ను వాడుకోవద్దని మీ యొక్క సంఘం పేరు ఏమిటో రిజిస్ట్రేషన్ నెంబర్ ఏమిటో తెలపాలని లేనిచో మా సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఆయన అన్నారు. మా సంఘం పేరును మా రిజిస్ట్రేషన్ నంబర్ను ఉపయోగించుకుని కార్యక్రమాలు చేపట్టినట్టు అయితే మీ పైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## దంపతుల ను మింగిన కరోనా




బెల్లంపల్లి మార్చి 25 ప్రజా పాలన ప్రతినిధి:ఉన్నత విద్యావంతులైన దంపతులు కరోనాతో మృతిచెందడం బెల్లంపల్లిలో పట్టణంలో తీవ్ర కలవరం రేపుతోంది. బెల్లంపల్లి పట్టణం లోని స్టేషన్ రోడ్డు కాలనీకి చెందిన ప్రధానోపా ధ్యాయులు సిరికొండ రమాదేవి ఈ నెల 17న కరోనా తో మృతి చెందగా ఆమె బర్త సిరికొండ ఆంజనేయ రావు కరోనా తో ఆదివారం మృతి చెందారు.దింతో బెల్లంపల్లి పట్టణంలో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.ఇదీలా ఉండగా ఒకే కుటుంబానికి చెందిన బార్య బర్తలు ఇద్దరు కరోనా తో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర మానసిక వేదన తో ఉండడం దానికి తోడు ఆమె భర్త సిరికొండ ఆంజనేయ రావు ఆదివారం ఉదయం కరోనాతో మృతి చెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది .




ప్రజాపాలన

సంపాదకీయం

సోమవారం 26, ఏప్రిల్ 2021

# పట్టభద్రులయితే మాత్రం కొమ్ములుంటాయా?

ఆయనెవరో కేరళలో బిజెపి నాయకుడట, చదువుకున్న వాళ్లు ఎక్కువైనందువల్లనే రాష్ట్రంలో తమ పార్టీ బలం పుంజుకోవడం లేదని బాధ పడుతున్నాడు. చదువుకున్నవాళ్లు చెప్పినమాటకు తలూపకుండా మొండి వాదనలు చేస్తారని కూడా ఆయన ఫిర్యాదు చేశాడు. కేరళ రాష్ట్రంలో చదువుకున్నవారి శాతం దేశంలోనే ఎక్కువ అని తెలిసిందే. ఆ రాష్ట్ర ప్రజల జీవనవిధానానికి, సామరస్య జీవనానికి, సాంస్కృతిక ప్రత్యేకతలకి, రాజకీయ ప్రాధాన్యాలకు అక్షరాస్యతా చదువూ కారణాలని పదే పదే వింటూ ఉంటాము. ఇటువంటి నిర్ధారణలు నోటి మాటగా చేసేవే తప్ప, నిరూపణకు నిలుస్తాయా అన్నది సందేహమే.కేరళ విషయం అనే కాదు, దేశంలోనే కాస్త సంఘసంస్కారం, ఆధునిక విలువలు, విద్యా విస్తరణ ఉన్న ప్రాంతాలలో ప్రజలు భిన్నంగా ఉంటారని, బిజెపిని ఆదరించరని, బెంగాల్లో కానీ, దక్షిణాదిలో కానీ ఆ పార్టీకి చెల్లుబాటు తక్కువని చెబుతుంటారు. ఈ బడాయి పరిశీలనలకు చెలామణీ తగ్గిపోతున్నది. కేరళలో ఈసారి కాకపోతే మరోసారి, కాంగ్రెస్ ఆ కాస్తా ఆరిపోతే, లెఫ్ట్ ఫ్రంట్‌కు ప్రత్యామ్నాయం ఎన్డీఏ నో ఎన్డీఎఫ్ఫో నో అవుతుంది. వంతులవారీగా అధికారం పంచుకుంటుంది. బెంగాల్ విషయం చూస్తూనే ఉన్నాము. చాకచక్యమో అంకగణితమో అంగబలమో అధికారపార్టీని అంతిమంగా గట్టెక్కించగలవేమో కానీ, ప్రమాదం అయితే ముంచుకువచ్చింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఏ ముఖద్వారం గుండా దేశంలోకి వచ్చి, పరాధీనతతో పాటు, సామాజిక, సాంస్కృతిక మథనానికి కూడా ఆస్కారం కలిగించిందో, ఆ దారి మీదే ఒక ప్రతీఘాత వాదం కాచుకుని ఉన్నది. రెండున్నరవందలేళ్ల చరిత్రకు జాతీయ 'ప్రక్షాళన' అనివార్యమనిపిస్తున్నది. ఇక ఎక్కడ మాత్రం, అభ్యుదయం, విప్లవం, సమానత్వం, సామాజిక న్యాయం పైచేయిగా వర్థిల్లుతున్నాయని? రాటు తేలిన కరుడుగట్టిన తమిళులేం చేస్తున్నారు? గుడిగోపురాల పునరుద్ధరణ, తీర్థయాత్రల వితరణ ఎన్నికల వాగ్దానాలయ్యాక, ఏ పార్టీ గెలిచిందన్నది స్వయంసేవకులకు ఎందుకు? పురోగామి ప్రాంతాలలో ప్రజలు చీకటిని వ్యతిరేకించారు. వెలుతురును ప్రేమించారు. గోడలను ఛేదించారు. ఐక్యతలను నిర్మించారు. అక్షరాలలో ఆదర్శాలను ఉద్దీపింపచేశారు. ఉద్యమాలను ఉద్వేగాలలో, చరిత్రలో, అవగాహనలో నిలుపుకున్నారు. మరి ఎందుకు, కట్టుబాటు సడలిపోతున్నది? అవగాహన శిథిలమవుతున్నది? చదువులు, చదువులతో పాటు ఆచరణల అనుభవం కలిగిన తరతరాల వివేకం ఎక్కడ పలచబడిపోతున్నది? అసలు చదువుకి, చదువుకున్నవారికి మనం ఎక్కువ విలువ కట్టామా? సంస్కారం చదువులలో స్థిరపడలేదా? విచక్షణ అలవరిచే గుణం చదువులకు లేకుండా పోయిందా? ఒకసారి వేసిన ముందడుగు అట్లాగే నిలబడాలంటే, మరో ముందడుగుకు అవకాశమివ్వాలంటే ఏమి జరగాలి? చదువుకున్నవాళ్లకి, చదువులేని వాళ్లకీ సమానంగా ఓటుహక్కు ఉండడం గురించి బాధపడేవాళ్లు ఇప్పటికీ ఉన్నారు. గ్రామీణులు, ఎప్పుడూ బాధితులుగానో, ఏవో సహాయాలు ఆశించేవారిగానో ఉండే పేదలు– వీరు ఓటును అమ్ముకుంటారని, లేదా అమాయకంగా నేతలను గుడ్డిగా నమ్ముతారని అనుకోవడం మధ్యతరగతికి, పట్టణ విద్యాధిక శ్రేణికి అలవాటు. అందుకు తగ్గట్టుగానే, అధికారంలో ఉన్న పార్టీపై ఉన్న అసమ్మతి కొద్దోగొప్పో పట్టణ ప్రాంతాల ఎన్నికలలో వ్యక్తం కావడం జరిగేది. మెజారిటీ నిరక్షరాస్య, నిరుపేద ఓటర్లున్న దేశంలో మందబలపు ప్రజాస్వామ్యంలో తాము విశిష్ట అల్పసంఖ్యాకులమన్న నిష్కారపు అతిశయం చదువుకున్నవారిలో, నాగరికులలో కనిపించేది. పల్లెలు పట్నాలు అని లేకుండా దేశమంతా చుట్టబెడుతూ రాజసూయం చేస్తున్న భారతీయ జనతాపార్టీని ఒకప్పుడు పట్టణ పార్టీ అని, వర్తకుల పార్టీ అని భావించేవారు. విశాల ప్రజానీకాన్ని మైమరిపించే ఒక జాతీయరసాయనాన్ని తయారుచేసిన తరువాత, ఆ పార్టీకి ఇక ఎల్లలు లేకుండా పోయాయి. తాజాగా తెలంగాణలో చదువుకున్న వాళ్లు చర్చలోకి వచ్చారు. చేయవలసిందంతా చేసి, తనను తానే దెప్పిపొడుచుకోవడం తెలంగాణ సమాజానికి కూడా అలవాటవుతున్నట్టుంది. శాసనమండలికి రెండు పట్టభద్రుల నియోజకవర్గాల నుంచి జరిగిన ఎన్నికల విషయంలో, ఫలితాలు ఎట్లా వస్తే తెలంగాణ సమాజపు ప్రతిష్ఠకు అనుగుణంగా ఉండేవో అందరికీ తెలుసు. కానీ, బ్యాలట్ పెట్టె దగ్గర ఎవరి ప్రాధాన్యాలు వారివి. ఫలితాలు వచ్చాక, విద్యావంతులను, పట్టభద్రులను వెక్కిరించుకుంటూ వ్యాఖ్యలు. పట్టభద్రులు కావడంతో తలకెక్కే కిరీటం ఏమీ లేదు కదా? మహా అయితే, ఉద్యోగి లేదా నిరుద్యోగి. కానీ విద్యావంతులు కావడం వల్ల వారి మీద గొప్ప బాధ్యత ఉన్నదన్న అభిప్రాయం ఉంటుంది. అధికారపక్షాన్ని ఓడించడం మాత్రమే కాదు, ఒక గౌరవప్రదమైన ఎంపిక చేసి తమ స్థాయిని ప్రకటించుకోవలసిన అగత్యం పట్టభద్ర ఓటర్ల మీద ఉన్నదని ఇతరులు భావించారేమో కానీ, పట్టభద్రులు భావించినట్టు లేరు. ప్రత్యేక ఉద్యమంలో ఒక కీలకపాత్ర పోషించిన కోదండరామ్‌ను, తొంభైమందిలో ఒక్కగానొక్క శాసనమండలి సభ్యుడిగా కూడా గెలిపించుకోనక్కరలేదని తెలంగాణ రాష్ట్ర సమాజం, అందులోనూ తన గురించి తాను గొప్పలు చెప్పుకునే విద్యాధిక సమాజం భావించినప్పుడు, ఇక దానిపై ఏ చర్చ జరిపి కూడా ఉపయోగం లేదు. సాధారణంగా ఓటర్ల మెప్పు పొందవలసిన బాధ్యత అభ్యర్థిదే. చాలా తక్కువ సందర్భాలలో మాత్రమే ఫలానా అభ్యర్థిని గెలిపించుకోవలసిన భారం ఓటర్ల మీద పడుతుంది. ఆ పరీక్షలో తెలంగాణ ఓడిపోయింది. ఇది శాసనసభ ఎన్నిక అయినా, మరే రకం ఓటర్ల నియోజకవర్గం అయినా సరే ఫలితం ఇట్లాగే ఉండేది. చిన్న ఎన్నిక కూడా గెలవలేదని కెసిఆర్ అన్నారంటే, అది వాస్తవం అయి ఉండాలి. ఇటువంటి ఎన్నికలను కోదండరామ్, మల్లన్న, చెరుకుసుధాకర్, రాణిరుద్రమ.. వీళ్లెవరూ గెలవలేరు. ఆ అశక్తత వెనుక ఉన్న విలువలేమిటో కెసిఆర్‌కు తెలియనివి కాదు. ?ఇక నుంచి తామేదో పెద్ద మేధావులమని, ఆలోచనాపరులమని చెప్పుకోవడం తెలంగాణ విద్యావంతులు మానుకోవాలి. ఇతరులూ వారిని అట్లా పరిగణించనవసరం లేదు. వారూ మామూలు మనుషులే. చదువులు ఉన్నాయి కానీ, అది అనివార్యంగా విచక్షణకు దారితీయాలని లేదు కదా? ఓడిపోయినవారందరి లెక్కలు తీసి, గెలిచిన అభ్యర్థి కంటె ఎక్కువే ఉన్నాయి కదా అని అల్పసంతోషం తెచ్చుకుని సంతృప్తి చెందనక్కరలేదు. ప్రభుత్వ వ్యతిరేకత చూపగలిగిన అభ్యర్థులందరూ ఓడిపోయారు. వారిని ఓటర్లు ఓడించారు. ప్రశ్నించగలిగే ప్రతినిధులు వారికి అక్కరలేదు. హైదరాబాద్ లోనూ అదే జరిగింది. నాగేశ్వర్ కాకపోతే, రెండో స్థానం దాకా వచ్చిన రాంచంద్రరావునే గెలిపించి ఉండాలి. ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించేవాడు. కనీసం ఆయన తెలంగాణ ఉద్యమంలో ఉన్నాడు. ఇక్కడ బోనులో ఉన్నది ఓటర్ల విచక్షణే తప్ప ఇందులో గెలిచినవారి తప్పేమీ లేదు. ఇక, నల్లగొండ-వరంగల్‌లో తీన్మార్ మల్లన రెండో స్థానంలోకి రాగలగడం వెనుక ఆయన శక్తిసామర్థ్యాలు, ఇతర నేపథ్య కారణాలు ఏమేమి పనిచేశాయో సమీక్షించుకోవలసిందే. ప్రభుత్వాన్ని విమర్శించడంలో ఆయన తీవ్రస్వరం ప్రజలను ఆకట్టుకుంటున్నదని అంటున్నారు. కానీ, నిజంగా, తెలంగాణ సమాజం ప్రభుత్వంపై తీవ్ర విమర్శను కోరుకుంటున్నదా? విమర్శకులను ఆదరిస్తున్నదా? ప్రజాప్రతినిధిగా చట్టసభకు పంపడానికి ఓటర్లకు వేరే లెక్కలు ఉంటాయి కానీ, ప్రజల తరఫున మాట్లాడడానికి కోదండరామ్ అండ్ బృందానికి ఎప్పుడూ అవకాశం ప్రజలు ఇస్తూనే ఉంటారు. ఆయన ఆ బాధ్యతలోనే రాణిస్తారు. అందులోనే ఎక్కువ గౌరవం పొందుతారు. అదే ఆయన వంటి వారికి పదవి. ఒకసారి ప్రజలు పెద్దమార్పు తెచ్చుకుంటారు. దానితో ప్రజల భావాలలో కూడా మార్పులువస్తాయి. కానీ, ఆ మార్పుని, భావాలని అదే స్థాయిలో నిర్వహించకపోతే, అవి పాతపడిపోతాయి. బుద్ధి బూజుపట్టిపోయి, వెనకడుగులు వేస్తాము. తెలంగాణ ఉద్యమం గొప్పదే. ఎంతో చైతన్యంతో ఐకమత్యంతో చేసిందే. కానీ, వాటిని నిలుపుకోలేకపోతే, విచ్ఛిన్నతే ఎదురయింది. ఇంకా ఇంకా నిలవనీరుగా మిగిలిపోతే, ప్రత్యేకతెలంగాణ ఉద్యమం నుంచే కాదు, తెలంగాణరైతాంగ పోరాటం వంటి చరిత్ర నుంచి కూడా వెనుకకు వెనుకకు నడవవలసి వస్తుంది.

# సుప్రీంకోర్టుకు కొత్త సారథి-తీవ్ర సవాళ్లు




సుప్రీంకోర్టు 48వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ నూతలపాటి వెంకట రమణ ప్రమాణ స్వీకారం చేశారు. 2013లో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ రమణ అంతకుముందు ఉమ్మడి ఎ.పి హైకోర్టు న్యాయమూర్తిగా, తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. అత్యున్నత న్యాయస్థానంలో ఎనిమిదేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించిన ఆయన సి.జె గా ఏప్రిల్ 24 నుంచి 2022 ఆగష్టు 26 వరకూ పదహారు నెలల పాటు పదవిలో వుంటారు. ఏప్రిల్ 23న సిజెఐ గా పదవీ విరమణ చేసిన జస్టిస్ బాబ్డే సీనియారిటీ ప్రకారమే 48వ న్యాయమూర్తిగా ఆయన పేరును సిఫార్సు చేశారు. సుప్రీం న్యాయమూర్తులలో అత్యంత సీనియర్‌ను నియమించడం సంప్రదాయమైనా సరే నెల రోజుల ముందుగా తన తదుపరి సి.జె పేరు సిఫార్సు చేయడం ఆనవాయితీ. ఏ కారణం చేతనైనా సీనియార్టీ ప్రకారం వున్నవారిని నియమించలేని పరిస్థితి వస్తే ముందే చర్చ చేయవలసి వుంటుంది. జస్టిస్ రమణపై ఎ.పి ముఖ్యమంత్రి జగన్ కొన్ని ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో కొంత ఆసక్తి నెలకొన్నప్పటికీ ఆయన నియమాకం తథ్యమని ముందే స్పష్టమైంది. సుప్రీం కోర్టులో ఖాళీల భర్తీ పైన, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్నను సుప్రీంకు తీసుకు వస్తే 2027లో తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తి అవుతారనే అంశం పైన చర్చ జరిగింది తప్ప తదుపరి సిజెఐ గురించి కొలీజియంలో భిన్నాభిప్రాయాలు వచ్చినట్టు కనిపించదు.

ఆరోపణల తోసివేత

జస్టిస్ రమణ పేరును సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు అదే సమయంలో ఆయనపై ముఖ్యమంత్రి జగన్ ఆరోపణలను తోసిపుచ్చినట్టు ప్రకటించింది. ఈ విషయంలో అనుకూలంగా వ్యతిరేకంగా రకరకాల వాదోపవాదాలు న్యాయవర్గాల నుంచి వినిపించాయి. ఈ ఆరోపణల విచారణకు సంబంధించి కొన్ని కథనాలు రాగా అంతర్గత విచారణ విషయాలు ఎప్పుడూ బహిరంగ పర్చబోమని వాటిని తోసిపుచ్చింది. అంతిమంగా ఆ ఆరోపణలలో పసలేదని తోసిపుచ్చినట్టు ప్రకటించింది. విచారణ ప్రక్రియ జరిపి తిరస్కరించడం పారదర్శకత లేదనే విమర్శకు సమాధానంగా భావించాల్సి వుంటుంది. అయితే ఆ ఆరోపణలను విచారించింది ఎవరు, ఏం తేల్చారనేది బయటపెట్టి వుండాల్సిందని సీనియర్ న్యాయవాదులు కొందరు రాశారు. ఏమైనా అది ముగిసిన అధ్యాయం.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తెలుగు వ్యక్తి నియమితులవటం ఇది రెండవ సారి. గతంలో ఎ.పి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగానూ పని చేసిన జస్టిస్ కోకా సుబ్బారావు 1966-67 మధ్య సి.జె గా పనిచేశారు. 1993-94లో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ వెంకటాచలయ్య కూడా ఇప్పటి ఎ.పి లోని లేపాక్షిలో జన్మించిన వ్యక్తి అయినప్పటికీ అది అప్పుడు ఉమ్మడి కర్ణాటక రాష్ట్రంలో భాగంగా వుండేది. మానేపల్లి నారాయణరావు వెంకటాచలయ్య అన్న ఆయన పేరు కూడా అచ్చం తెలుగు వారి పేరే అయినా చదువు కర్ణాటకలో సాగింది. ఈ మధ్య కాలంలో తెలుగువారు అనేకులు సుప్రీం కోర్టులో న్యాయమూర్తులుగా పని చేసినప్పటికీ ప్రధాన న్యాయమూర్తి స్థానం దాకా పయనించే అవకాశం జస్టిస్ నూతలపాటి వెంకట రమణకే దక్కింది. ఆయన పదవీ కాలం కూడా సాపేక్షంగా చాలా మంది సి.జె ల కన్నా అధికంగా వుంటుంది.

సుప్రీం ప్రతిష్టపై నీలినీడలు

చాలా దశాబ్దాల తర్వాత తెలుగు వ్యక్తి ప్రధాన న్యాయమూర్తి కావడం పట్ల సంతోషం వ్యక్తమైనా సుప్రీం కోర్టు ప్రతిష్ట అత్యంత క్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఆయన బాధ్యతలు తీసుకుంటున్నారు. ప్రధాన న్యాయమూర్తులుగా ఎస్.ఎ.బాబ్డే, అంతకు ముందు రంజన్ గొగోరుల హయాంలో అత్యున్నత న్యాయస్థానం కేంద్రం ఒత్తిళ్లకు లోబడిపోయిందనే ఆరోపణ బలపడింది. వరుసగా ఇచ్చిన తీర్పులు మోడీ సర్కారుకు సంతోషం కలిగించాయి. సిజెఐ గా రంజన్ గొగోరు అయోధ్య, రాఫెల్ తీర్పులు ఇచ్చారు. పదవీ విరమణ తర్వాత కొద్ది కాలానికే రాజ్యసభ సభ్యత్వం పొంది విమర్శలు మూట కట్టుకున్నారు. ఇక 2019 నవంబరులో ఎస్.ఎ బాబ్డే ప్రధాన న్యాయమూర్తి పదవి చేపట్టినప్పుడు కీలకమైన ఎన్నో కేసులు న్యాయస్థానం ముందు అపరిష్కృతంగా వుండిపోయాయి. జమ్మూ కాశ్మీర్‌కు రాజ్యాంగం ఇచ్చిన ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించి మూడు ముక్కలు కేంద్ర పాలిత ప్రాంతాలుగా చేసిన కేంద్రం నిరంకుశ చర్యను సవాలు చేస్తూ వంద పిటిషన్లు దాఖలయ్యాయి. కాని వాటిపై పూర్తి విచారణ జరగనేలేదు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) పైనా పిటిషన్లు వచ్చాయి. ఢిల్లీతో సహా దేశవ్యాపితంగా నిరసనలు సాగాయి. ముఖ్యంగా ఢిల్లీలో కుట్రపూరితంగా మత కలహాలు రగిలించి యువతను విద్యార్థులను అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టారు. జామియా మిలియా విశ్వవిద్యాలయం లోనూ దాడులు జరిగాయి. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ లోకి గ్యాంగులు చొరబడి దౌర్జన్యం చేశారు. ఇవన్నీ కళ్ల ఎదురుగా జరుగుతున్నా పలుసార్లు కేసులు వస్తున్నా సుప్రీంకోర్టు న్యాయం చేసేందుకు చొరవ తీసుకోలేదు. హత్రాస్ అత్యాచారం ఘటనలో అన్యాయంగా అరెస్టు చేయబడిన కేరళ జర్నలిస్టు సిద్దిక్ కప్పన్ కేసు వస్తే విచారించి మీడియా స్వేచ్ఛను కాపాడకపోగా ఇలాంటి కేసులు హైకోర్టుకే వెళ్లేలా తాను చర్యలు తీసుకుంటానని ప్రకటించింది. రోహింగ్యా శరణార్థులను ఆదుకునే విషయంలోనూ భారత దేశ సంప్రదాయం, రాజ్యాంగ విలువలు, అంతర్జాతీయ సూత్రాలను బేఖాతరు చేస్తూ జోక్యానికి నిరాకరించింది.

వివాదగ్రస్తమైన తీరు

ఇంతకంటే తీవ్రమైన విషయం ఎన్నికల బాండ్లకు సంబంధించిన కేసును పూర్తిగా పక్కన పెట్టేయడం. ప్రతి ఎన్నికల సమయంలోనూ ఆ బాండ్లపై స్టే విధించాలంటూ పిటిషన్లు వస్తూనే వున్నాయి. ఇవి ఎప్పటినుంచో వున్నాయనీ, ఈ విధమైన అభ్యర్థనలను ఇదివరకటి నుంచి వస్తున్నాయంటూ ప్రతిసారి సుప్రీంకోర్టు ధర్మాసనం వాటిని పక్కన పెడుతూ వచ్చింది. వలస కార్మికుల దుస్థితిపై దాఖలైన వ్యాజ్యాల విషయంలోనూ ఇదే విధమైన స్పందనా రాహిత్యం తాండవించింది. వారికోసం ఏం చేయాలనేది ప్రభుత్వానికే బాగా తెలుసంటూ కేసును చాలా కాలం సాగదీశారు. వలస కార్మికులకు తిండి పెడుతున్నప్పుడు మళ్లీ ఆర్థిక సహాయం దేనికని ఆఖరుకు సి.జె బాబ్డే స్వయంగా ప్రశ్నించారు. ఇదే కాలంలో కార్పొరేట్లకు సంబంధించిన పలు కేసుల్లో సుప్రీం కోర్టు అమితాసక్తి ప్రదర్శించింది. ఢిల్లీలో రైతుల ఆందోళనను పరిష్కరించాలనే కేసు లోనూ ఒక కంటితుడుపు కమిటీని వేసి కాలయాపన చేసింది. ఆ కమిటీ కూడా ప్రభుత్వ అనుకూల వ్యక్తులతో నిండి వుండటం, ఒకరు ముందే నిరాకరించడం దాన్ని మరింత పలచన చేసింది. తీరా ఆ కమిటీ సిఫార్సులు వచ్చి చాలా కాలం గడిచినా ఎలాంటి సానుకూల చర్యలు ఆదేశించింది మాత్రం లేదు. ప్రజల పేదల హక్కులను కాపాడ్డంలో ఈ విధంగా వ్యవహరించిన న్యాయస్థానం కోర్టు ధిక్కార కేసుల పేరిట మాత్రం ఎంతో సమయం వెచ్చించింది. అయోధ్య కేసులో 1991 ప్రార్థనా స్థలాల చట్టం ప్రాతిపదికగా చెప్పిన న్యాయస్థానం ఆ చట్టాన్నే సవాలు చేసే పిటిషన్‌ను అనుమతించడం మరో వైపరీత్యం. ఆ వెంటనే కాశీ, మథుర క్షేత్రాలలో వివాదాలను స్థానిక న్యాయస్థానాలు చేపట్టాయి.

న్యాయమూర్తుల నియామకం స్తంభన

కరోనా కారణంగా ఈ కాలంలో వర్చువల్ విచారణ పద్ధతి గొప్ప మార్పుగా చెబుతున్నా వాస్తవంలో అనేక కేసులు విచారణకు నోచుకోకుండానే పోయాయి. కేవలం 25 శాతం మాత్రమే విచారణ జరిగాయి. ఈ పరిస్థితి అనివార్యమైందనుకుంటే ఒక తీరు గాని ఇందుకు సి.జె బాబ్డేను పొగడ్తల్లో ముంచెత్తడం విచిత్రం. ఇప్పటికి వచ్చిన తీర్పులపైనే ఇంత అసంతృప్తి వుండగా కొత్తగా ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌ను కూడా ప్రవేశపెట్టేందుకు కోర్టు చర్చలు సాగిస్తున్నది. వాటి పాత్రపై న్యాయమూర్తులకే స్పష్టత వున్నట్టు లేదు. ఈ మొత్తం కాలంలో సుప్రీం కోర్టుకు ఒక్క న్యాయమూర్తిని కూడా అదనంగా నియమించలేకపోవడం పెద్ద లోపం. హైకోర్టుల్లోనూ 400 పైనే ఖాళీలున్నా కొలీజియం, కేంద్రం పరస్పరం బాధ్యతను నెట్టివేసుకుంటూ కాలం గడిపాయి. పదవీ విరమణకు ముందు రోజు సి.జె బాబ్డేతో కూడిన ధర్మాసనం రాజ్యాంగంలోని 224(ఎ) అధికరణాన్ని దాదాపు 60 ఏళ్ల తర్వాత పునరుద్ధరించి, రిటైర్డు జడ్జిలను హైకోర్టులకు నియమించవచ్చునని అనుమతినిచ్చింది. క్రమబద్ధమైన నియామకాలు పూర్తిచేయకపోగా ఈ విధంగా విచక్షణతో కూడిన నియామకాలు చేస్తే మళ్లీ అదెక్కడికి దారి తీస్తుందోననే సందేహాలు వున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులను తొక్కిపడుతూ ఒత్తిడికి గురి చేస్తున్నదనే అభిప్రాయం అందరిలో నెలకొంది. మాజీ సీనియర్ న్యాయమూర్తులు అరుణ్ మిశ్రా వంటి వారు ప్రధాని మోడీని అదేపనిగా పొగిడి తరించడం, రంజన్ గొగోరు రాజ్యసభకు వెళ్లడం ఆ సందేహాలను పెంచింది. తాజా మాజీ సి.జె బాబ్డే కూడా బహురంగాలలో ఆసక్తి వున్నవారు గనక పదవీ విరమణ తర్వాత ఏదైనా చేయవచ్చునని ప్రస్తుత సిజెఐ ఎన్.వి.రమణ వీడ్కోలు ప్రసంగంలో చెప్పడంలోనూ సంకేతాలున్నాయి.

భవిష్యత్ గమనం?

సిజెఐ గా ఎన్.వి రమణ పదవీ కాలం సాపేక్షంగా చాలా మంది కన్నా కొంచెం ఎక్కువగానే వుంటుంది. రాజకీయ నాయకులపై, ప్రజా ప్రతినిధులపై కేసులను వేగంగా పరిష్కరించాలన్నది గతంలో జస్టిస్ రమణ తీసుకున్న కీలక నిర్ణయం. పేదలకు కూడా న్యాయ సహాయం సమానంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నది ఈ సిఫార్సుకు ముందు రోజు ఆయన చేసిన ప్రసంగం.

నదీ జలాల వివాదాలు రాష్ట్రాల హక్కులకు సంబంధించి కూడా ఆయన తీర్పులను ప్రస్తావిస్తుంటారు. తెలుగు రాష్ట్రాలకే నదీ జల వివాదాలు ఒకవైపు రాష్ట్రాల హక్కులపై కేంద్రం తీవ్ర దాడి మరోవైపు సాగుతున్న ఈ కాలంలో మరి ఆయన తీర్పుల పరంగానూ న్యాయ వ్యవస్థ నిర్వహణ పరంగానూ ఎలాంటి అడుగులు పడేది చూడవలసిందే. చట్టం వ్యవస్థపై ఆధారపడిందే గాని వ్యవస్థ చట్టంపై ఆధారపడి వుండదన్న కారల్‌మార్క్స్ మాట ప్రకారం వ్యక్తులను బట్టి మౌలిక మార్పులకు పెద్ద అవకాశం వుండకపోయినా న్యాయమూర్తులు చేయగలిగింది చాలానే వుంటుంది. మసకబారిన సుప్రీం ప్రతిష్ట రీత్యా కొత్త సిజెఐ జస్టిస్ ఎన్.వి రమణ ఏం చేస్తారనేది రేపటి నుంచే చూడొచ్చు.

## 2030కి మలేరియా నిర్మూలిద్దాం




మధిర ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరుపున జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి జిల్లా మలేరియా అధికారి, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి ఆదేశాలు మేరకు పీహెచ్దెందుకూరు పరధిలో, మధిర 1,మధిర 2, సబ్ సెంటర్ తరపున మధిర సివిల్ హాస్పిటల్ ప్రాంగణంలో సివిల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె అనిల్, డాక్టర్ శ్రావణ్ కుమార్, %ూష్ట్రఽ% దెందుకూరు ఇంచార్జ్ వైద్య అధికారినణి %ుఱ% పుష్పలత సూచనల మేరకు ఆరోగ్యపర్యవేక్షకుడు లంకా కొండయ్య పారామెడికల్ బృందం సివిల్ హాస్పిటల్ కు వచ్చిన ప్రజలకు ప్రపంచ మలేరియా డే సందర్బంగా 2030నాటికీ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు మలేరియా వ్యాది నిర్మూలన విషయం లోప్రతి పౌరుడు బాధ్యతగా కృషి చేయాలనీ ప్రతి ఒక్కరు తమ ఇంటి పరి సరాలను శుభ్రంగా ఉంచుకోవాలని దోమలు పుట్ట కుండా దోమలు కుట్ట కుండా చూడాలి అని, పరిసరాలు పారి శుధ్యం పాటించాలని సంపూర్ణ ముగా తెలియ పరిచినారు. ఈ కార్యక్రమం లొ %జూష్ట్రఽ% పారామెడికల్ సిబ్బంది సివిల్ హాస్పిటల్ సిబ్బంది 108సిబ్బంది 104సిబ్బంది పాల్గొన్నారు.

## మిత్రుని కూతురు వివాహానికి ఆర్థిక సహాయం



జిన్నారం, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:జిన్నారం గ్రామానికి చెందిన బుక్క వెంకటేష్ గతంలో అకస్మాత్తుగా మరణించిన విషయం అందరికి తెలిసిందే,అయితే బుక్క వెంకటేష్ తో పాటు 10వ తరగతి చదువుకున్న 1991 %శీ% 1992 సంవత్సరానికి చెందిన మిత్రులందరు 2లక్షలు రూపాయలు ఆయన కూతురు వివాహానికి ఆర్థిక సహాయంచేసి మానవత్వం చాటుకొన్నారు,స్నేహం అనే పదానికి అర్థం చాటిల్లిన స్నేహితులు,ఇట్టి డబ్బులను మిత్రులు జిన్నారం వైస్ ఎంపీపీ గంగు రమేష్,సోలక్పల్లి సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి,బుక్క వెంకటేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు,వారందరికి వెంకటేష్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలపారు..

## పాత ఏరియా ఆసుపత్రిలోని ఓ. పి. ల్యాబ్, ఫార్మసీలను కొత్త ఏరియా ఆసుపత్రికి తరలించాలి:జిల్లా కలెక్టర్ పౌసుమి బసు



వికారాబాద్ ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: పాత ఏరియా ఆస్పత్రి లోని ఓ పి లాబ్ ఫార్మసీ లను కొత్త ఏరియా ఆస్పత్రికి తరలించాలని జిల్లా కలెక్టర్ పౌసుమి బసు వైద్యాధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాత మరియు కొత్త ఏరియా ఆసుపత్రులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ వైద్య అధికారులతో మాట్లాడుతూ పాత ఏరియా ఆసుపత్రిలోని ఓ. పి. ల్యాబ్, ఫార్మసీ లను కొత్త ఏరియా ఆసుపత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కోవిడ్ టెస్టింగ్ ఇతర విభాగాలు అన్ని అక్కడికే తరలించాలని సూచించారు. ప్రసూతి విభాగం తప్ప అన్ని విభాగాలు ఎస్ఏపీ కళాశాల వద్ద నిర్మించిన నూతన ఆసుపత్రికి ఆదేశాలు అందిన వెంటనే తరలించేందుకు సిద్ధం కావాలని ఆదేశించారు. మే 1 నుండి ప్రతి ఒక్కరికి కోవిడ్ వాక్సిన్ అందే విధంగా అన్ని ఏర్పాట్లు చేసుకోనాలని వైద్య అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి సుధాకర్ షిండే, డాక్టర్ అరవింద్, డాక్టర్ రమ్యశ్రీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించండి:ఎంపీపీ జమున



సారంగాపూర్, ఏప్రిల్ 25 (ప్రజాపాలన ప్రతినిధి): సారంగాపూర్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కోల జమునశ్రీనివాస్ మండల ప్రజలకు సలహాలు సూచనలు చేస్తు నా ప్రజలందరు కరోనా మహమ్మారి నుంచి బయట పడాలని ఎవరికి కూడ హాని కలుగవద్దని అందరూ క్షేమంగా ఉండాలని శ్రీ దుబ్బ రాజేశ్వర స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరారు. సమస్త మండల ప్రజలు ఎవరి ఇంట్లో వారు ఉండలని కుటుంబ సభ్యులు బంధువులు స్నేహితులు భౌతిక దూరం పాటించి శానిటైజర్ ఉపయోగించి చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జమున సూచించారు.

# ఆశా బాధితుల కుటుంబాలను ఆదుకుందాం

### సాఫ్ట్ వేర్ జనాఫాక్ట్ కంపెనీ ఉద్యోగి నీలం శ్రీనివాసరావుఆశా బాధితుల సౌకర్యార్థం కుర్చీల వితరణ

మధిర ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: సాయంత్రం మధిర పట్నం లొ గత 25 సంవత్సరాలనుండి ఎయిడ్స్ బాధితుల కు సేవా సహాయ కార్యక్రమం లు చేపడుతున్న అజాద్ రోడ్డు లొ నివాసం ఉంటున్న ప్రముఖ సామాజిక సేవకుడు (ఆరోగ్య పరివేక్ష కుడు )ఆశ మిత్ర లంకా కొండయ్య నిస్వార్థంగాచేవడుతున్న ఆశ బాధితుల పునరావాస సహాయ కేంద్రానికి మడుపల్లి నివాని మానవతా వాది శ్రీ నీలం కృష్ణ మూర్తి గారి కుమారుడు హైద్రాబాద్ జనాఫాక్ట్ కంపెనీ సాఫ్ట్ వేర్ ఉద్యోగి అయిన శ్రీ నీలం శ్రీనివాస్ రావు ఆర్థిక వితరణ తో ఆశ బాధితుల కుటుంబాలు సౌకర్యార్థం 20 నీల్ కమల్ కుర్చీలు వితరణ గా కొండయ్య కుటుంబంనకు అందచేసినారు. ఈ సందర్బంగా నీలం శ్రీనివాన్ రావు మాట్లాడుతూ సమాజ%శీ% లో ఎంతో మంది తెలిసి తెలియక తప్పు లు చేసి ఎయిడ్స్ బారిన పడి కుటుంబాలు చెల్లా చెదరై ఆదరణ కూ నోచుకోక దయనీ యా పరిస్థితి లొ ఉన్న వారిని చేర దీసి నేనున్న మీకు ఏమి కాదని కొండంత భరోసాతో సేవా చేనస్తాన్న లంకా కొండయ్య సేవలు సోషల్ మీడియా ప్రింట్ మీడియా ద్వారా తెలుసు కొని వారి సేవలో చంద్రునికో నూలు పోగు లాగా ఈ చిన్న సహాయం చేయాలని పించింది అని (శీనివాన్ రావు తెలిపినారు.అదేవిదంగా సామాజిక సేవకుడు లంకా కొండయ్య మాట్లాడుతూ గతజనతాకర్ ఫ్యూ మొదలుకొని ఇప్పటి వరకు అనేక మంది దాతలు చేత ఆశ బాధితుల కూ టీబీ పేషెంట్ లకువికలాంగులకు వితంతు వు లకు వృద్దులుకు అజాద్ రోడ్డు లొ చెట్ల నీడన నిల బెట్టి మరియు టెంట్ కుర్చీలు అద్దె కూ తెప్పించి సేవా సహాయ కార్యక్రమం చేస్తున్న విషయం మిత్రులు నీలం శ్రీనివాన్ రావు గమనించి మానవత దృక్పద %శీ% తో దయా హృదయం%శీ% తో స్పందించి కుర్చీలు వితరణ చేయటం నా యొక్క హృదయపూర్వక అభినందనలు తెలియపరస్తున్నా నని కొండయ్య తెలిపినారు.ఈ కార్యక్రమం లొ లంకా సేవా ఫాండేషన్ వాలంటీర్లు ఆదిమూలం వెంకటేష్, లంకా కరుణ, లియోనా,శ్యామ్ కుమార్,గోపి, సాయి, అంజి తదితరులు పాల్గొన్నారు.




## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న డాక్టర్స్, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలి



మధిర ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:భర్తీచేసిదెందుకురు,చుట్టుపక్కల గ్రామ ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(%ణ్ఖీ×%) జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ డిమాండ్ చేశారు.ఈ రోజు డివైఎఫ్ఐ బృందం దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య కేంద్రంలో ఉన్న పరిస్థితిని డ్యూటీలో ఉన్న సిబ్బందిని చికిత్స కోసం వచ్చిన రోగులను అడిగి తెలుసుకోవడం జరిగింది.అనంతరం మద్దాల ప్రభాకర్ మాట్లాడుతూ... ఈ హాస్పిటల్ బిల్డింగ్ సక్రమంగా లేకపోవడం వల్ల గర్భిణీ స్త్రీలు,చంటి పిల్లలతో బాలింతలు, వృద్ధులు ఎండలో రోడ్లపై వేచి ఉండాల్సి వస్తోందని అన్నారు.హాస్పటల్ కు ఇద్దరు డాక్టర్స్ పోస్టులు ఖాళీగా ఉండగా తాత్కాలికంగా ఒక్క కాంట్రాక్ట్ డాక్టర్ మాత్రమే ఉన్నారన్నారు.దెందుకూరు పీహెచ్సీలో ఫార్మాసిటికల్ లేక రోగులకు మందులు అందించడం లేదని కోవిడ్ పాజిటివ్ వచ్చిన పేషెంట్స్ కు వాళ్ల గ్రామాలలో ఆశావర్కర్లు వద్ద తీసుకోవాలని చెప్పి పంపడం ఆశా వర్కర్లును అడిగితే కరోనా వస్తే ఎలాంటి మందులు ఇస్తారో తెలియదని మా వద్ద మందులు లేవని చెప్పటంతో రోగులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులు డాక్టర్స్ రెండు, ఏఎన్ఎంలు రెండు, పార్మాసిటికల్స్ రెండు, ల్యాబ్ టెక్నీషియన్ మూడు,స్టాఫ్ నర్స్ నాలుగు, స్లీపర్ ఈ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయని వీటిని వెంటనే పర్మినెంట్ గా భర్తీ చేయాలని, అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఖాళీలను భర్తీచేసి కరోనా మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా 24 గంటలు వైద్య సేవలు అందించాలని ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్ వైద్యసేవలను వెంటనే ఆరోగ్య శ్రీ లో చేర్చి పేదలకు ఉచిత మెరుగైన వైద్య సేవలుఅందించాలని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని దీని వల్ల ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఉందని వెంటనే ప్రజా సంక్షేమాన్ని ఆలోచించి ప్రభుత్వం స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని అన్నారు.ప్రభుత్వం స్పందించని పక్షంలో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి ఆస్పత్రి సమస్యలపై పోరాటం నిర్వహిస్తామని ఈ పోరాటంలో ఈ ప్రాంత ప్రజలంతా కలిసి రావాలని ప్రజాప్రతినిధులను ఆస్పటల్ సమస్యలపై నిలదీయాలని పిలుపునిచ్చారు..ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి అల్లూరి నాగేశ్వరరావు, ఓట్ల శంకర్రావు డివైఎఫ్ఐ నాయకులు కేసరివీరభద్రం, ఎలిజాలగోపి, కిరణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధిపేటలో గెలుపు మాదే..

### టిఆర్ఎస్ తాటాకు చప్పుళ్ళకు భయపడేది లేదు.. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు





సిద్దిపేటఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: సిద్దిపేటలో టిఆర్ఎస్ తాటాకు చప్పుళ్ళకు బీజేపీ అభ్యర్థులు ఎవరు భయపడరని,ఎన్ని అడ్డంకులు సృష్టించిన పురపోరులో బిజెపి అభ్యర్థుల గెలుపు ఖాయమని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు స్పష్టం చేశారు.సిద్దిపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం 16,31,32,33,34,43వ,వార్డుల బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ సిద్దిపేటలో అభివృద్ధి బూటకం అని కొట్టిపారేశారు.ఓట్ల కోసం మంత్రి హరీష్ రావు టిఆర్ఎస్ నాయకులు పోలీసులను వాడుకుంటూ టిఆర్ఎస్ కు వ్యతిరేకంగా పనిచేస్తున్న వాళ్ళను బెదిరిస్తున్నారని ఆరోపించారు.మెయిన్ రోడ్లలో కొంతమేర అభివృద్ధి జరిగింది తప్ప గల్లీలలో ఏమీ జరగలేదని విమర్శించారు.ప్రజల జీవన స్థితిగతులు మెరుగు పడాలంటే గల్లీలు అభివృద్ధి చెందాలని ఆయన పేర్కొన్నారు.ఎన్నికలు వచ్చాయని ఆగమాగం రోడ్లు వేనస్తా నానిరకం వనులు చేవడంతంన్నారని అన్నారు.మున్సిపల్ ఎలక్షన్లు దృష్టిలో పెట్టుకొని రోడ్లుకు నున్నటి మెరుగులు అద్దుతూ మెరిపిస్తున్నారని ఎద్దేవా చేశారు.ఫుట్ పాత్ లకు హరిత హారంలో పెట్టిన చెట్లకు రంగులు వేసి ఇదే అభివృద్ధి అని మాయమాటలు చెప్పి ప్రజలను మభ్య పెట్టాలని చూడటం ఎంత వరకు సమంజనమని ప్రశ్నించారు.సిద్దిపేటను మనిషూని మారేడు కాయు చేస్తున్నారని వాపోయారు.సిద్దిపేట పట్టణ ప్రజల జీవన స్థితి గతులు మెరుగుపడాలంటే ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని రఘునందన్ రావు ప్రజలను కోరారు.సిద్దిపేటలో అభివృద్ధి పేరిట కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు.బిజెపిని గెలిపిస్తే జరిగిన అవినీతి పై విజిలెన్స్ విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని రఘునందన్ రావు స్పష్టం చేశారు.ప్రచార కార్యక్రమంలో అభ్యర్థులు బొల్లవేని యాదగిరి,భాష శ్రీకాంత్,నందిని సునీల్, పైసా సుగుణ రామకృష్ణ,పుల్లయ్య గారి ఇంద్రాణి వెంకట్,కృష్ణవేణి మీడియా సెల్ జిల్లా కన్వీనర్ గోనె మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు కోవిడ్ 19పై అవగాహన:గంజి పల్లి సర్పంచ్ కల్పన వెంకటేష్



జిన్నారం, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:మండల ప్రజలకు కోవిడ్ 19 అవగాహన కల్పిస్తున్నట్లు మండల ఎస్ఐ దేవంబోట్ల రాజు మరియు ఏఎస్ఐ నంగయ్య తెలిపారు.ఆదివారం దోమ మండల పరిధిలోనీ గంజి పల్లిగ్రామా%శీ%లో పోలీస్ వాహనంపై మైక్ సెట్టు అమర్చి మాటక,పాటక రూపకంలో గ్రామాల ప్రజలకు కోవిడ్ పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కరోనా వ్యాధి వ్యాప్తి రోజు రోజు వృద్ధి చెందుతున్న తరుణంలో గ్రామస్తులు కరోనా వ్యాధిని అడ్డుకట్టవేయడానికి స్వీయ నియంత్రణ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.కరోనా మండలంలో చాపకింద నీరుల విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ జీవో-68 నిబంధనల ప్రకారం గ్రామంలోని ప్రతి ఒక్కరూ మాస్కు ధరించాలని,సామాజిక దూరం పాటించలన్నారు.బహిరంగ ప్రదేశాలలో గాని, పనిచేయుచున్న స్థలంలో గాని,వ్యాపార లావాదేవీల విషయంలో, రవాణా సందర్భంలో పై నియమాలను పాటించాలని తెలిపారు. జీవో-69 నిబంధనల ప్రకారం సభలు, సమావేశలు,ఊరేగింపులు, విందులు చేయరాదన్నారు.నెలలో వచ్చే పండుగలకు అనుమతి లేదని తెలిపారు.పై నిబంధనలు అమలులో ఉంటుందన్నారు.పై నిబంధనలు ఉల్లంఘించినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడునని తెలిపారు. గ్రామంలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రతి ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించి, అత్యవసర పరిస్థితులలో 100 డయల్ ను వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమ. పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా టీకా పై ప్రజలు అపోహలు పెట్టుకోవద్దు

### కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి



మేడిపల్లి, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా టీకా పట్ల ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, టీకా నూటికి నూరు శాతం సురక్షితంతో పాటు కరోనా ఉధ్రుతి నుండి ఖచ్చితంగా బయటపడేస్తుందని పీర్జాదిగూడ నగరపాలక సంస్థ 26వ డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి భరోసానిచ్చారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధి మేడిపల్లి ఐసోలేషన్ సెంటర్లో కరోనా వాక్సినేషన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ గురించి వైద్యులను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి మొదటి డోస్ కరోనా టీకాను తీసుకున్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సదుపాయాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. టీకా సరఫరాలపై అధికారులతో చర్చించి నిరంతరం టీకా అందుభాటులో ఉంచేలా ఆదేశాలిచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కరోనా టీకా తీసుకున్నప్పటికీ మాస్కులు, భౌతికధూరం పాటించినప్పుడే పూర్తిగా కరోనా నుండి రక్షణ లభిస్తుందని తెలిపారు. కరోనా అందరికి ప్రాణాంతకమైనది కాకున్నా కొంతమందిలో తీవ్ర ప్రభావం చూపిస్తున్న నేపథ్యంలో అలాంటి వారిని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ భాద్యతగా వ్యవహరించాలని సూచించారు.

## కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్లను పెంచండి

### కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్ రావు



మేడిపల్లి, ఏప్రిల్ 25 (ప్రజాపాలన ప్రతినిధి) :రామంతపూర్ డివిజన్లో కోవిడ్ వ్యాక్సినేషన్ సెంటర్లను పెంచాలని స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు డిహెచ్ఎంఓ డాక్టర్ మల్లికార్జున్ కు విజ్ఞప్తి చేశారు. వచ్చేనెల మే నుండి 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ కరోనా వ్యాక్సిన్ ఇవ్వనున్న నేపథ్యంలో 18 సంవత్సరాలు పైబడిన వారు చాలా ఎక్కువ మొత్తంలో ఉంటారు కాబట్టి ఇప్పుడు మనకు ఉన్న సెంటర్లు సరిపో నందున ముందు జాగ్రత్తగా రామంతపూర్ ప్రధాన రహదారిలో ఉన్న ఎస్ఎంఆర్ అపార్ట్మెంట్, బస్తి దావఖానలు, కమిటీ హాల్స్ లలో ఇంకా కొన్ని.కరోనా వ్యాక్సిన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిహెచ్ఎంఓ డాక్టర్ మల్లికార్జున్ ను కోరమని కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావు తెలిపారు. డాక్టర్ వెంటనే స్పందించి పై అధికారులతో మాట్లాడి సెంటర్లు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు.

# సిద్దిపేటలో టిఆర్ఎస్ నాయకుల అవినీతిపై ఛార్జ్ షీట్‌ని విడుదల చేసిన రాష్ట్ర బీజేపీ ఇంఛార్జ్ తరుణ్ చుగ్

- ఒక చెరువు అభివృద్ధి పేరుతో ఇంత అవినీతా..?
- యువతకు ఉపాధి కల్పించే ఒక్క పనైనా చేశారా..?
- అయిదు సంవత్సరాలుగా గగ్గోలు పెట్టినా వేయని రోడ్లు ఎన్నిక లొచ్చాయని రాత్రికి రాత్రే వేశారు.
- అభివృద్ధి పేరు చెప్పి చేసే ప్రతీ పనిలో అవినీతే :తరుణ్ చుగ్





సిద్ది పేట(ప్రజాపాలన ప్రతినిధి) :గత ఐదు సంవత్సరాలుగా ప్రజలు రోడ్లతో ఎన్నెన్నో ఇబ్బందులు పడుతూ రోడ్లు వేయండి మహాప్రభో అని మొత్తుకున్నా లేనిది ఎలెక్షన్ లు వస్తున్నాయనగానే రాత్రికి రాత్రే రోడ్లు వేస్తారు,కనీసం వేసిన రోడ్లయినా నాణ్యతతో ఉన్నాయా అన్నది ప్రజలకు మంత్రి, టి ఆర్ ఎస్ నాయకులు సమాధానం చెప్పాలి అన్నారు రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ చుగ్. సిద్ధిపేట లోని స్థానిక వయెాలా గార్డెన్ లో బీజేపీ కార్యకర్తల రివ్యూ మీటింగ్ లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సిద్దిపేటలో టి ఆర్ ఎస్ నాయకుల అవినీతిపై ఛార్జ్ షీట్ ను విడుదల చేస్తున్నామన్నారు. టి ఆర్ ఎస్ ప్రభుత్వం,టి ఆర్ ఎస్ నాయకులు సిద్దిపేట పేదప్రజలను ఎంత లూటీ చేస్తున్నారో ఈ ఛార్జ్ షీట్ లో సంక్షిప్త పరిచామన్నారు.సిద్దిపేట గల్లీలోని ఏ వ్యక్తిని అడిగినా టి ఆర్ ఎస్ నాయకుల అవినీతి గురించి చెపుతారన్నారు. సిద్ధిపేటను అభివృద్ధి పరిచామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆ అభివృద్ధి మొత్తం టి ఆర్ ఎస్ నాయకుల కుటుంబాలలో మాత్రమే కనిపిస్తుందన్నారు. అధికారంలోకి రాకముందు టి ఆర్ ఎస్ నాయకులెలా ఉండేవారో అధికారంలోకి వచ్చాక నేడు వారి ఆర్థిక స్థితిగతులు ఎలా ఉన్నాయో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఒక చెరువు పేరు చెప్పి మీరు ఎంత అవినీతి చేశారో ప్రజలకు తెలియదా అని ప్రశ్నించారు. ఈ చెరువు పేరు మీద ఎంతమంది అభివృద్ధి చెందారో చెప్పాలని ప్రచారంలో మంత్రిని,టి ఆర్ ఎస్ నాయకులను ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో టి ఆర్ ఎస్ నాయకుల జేబులు నింపుకుంటున్నారే తప్ప ఎంతమంది యువతకు ఉపాధి కల్పించారో తెలపాలన్నారు. లాభాపేక్షతో చెరువులపై,కట్టడాలపై ఉన్న శ్రద్ధ యువత కడుపు నింపే కార్యక్రమాలెన్ని చేశారో చెప్పాలన్నారు. డబుల్ బెడ్ రూమ్ పేరు చెప్పి 12 వేల అప్లికేషన్ లలో 2 వేల మందికి కూడా సరిగా ఇవ్వలేదన్నారు, కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీం తో అభివృద్ధి పనులను చేపడుతుంటే ఆ స్కీం ద్వారా లబ్ది పొంది అది రాష్ట్ర ప్రభుత్వం చేసినట్టుగా చెప్పుకుంటున్నారని ఎద్దేవాచేశారు. కట్ మనీ ఔర్ ఝట్ మనీ అన్నదే ముఖ్యమంత్రి విధానమని,అబద్దాల ముఖ్యమంత్రి అన్న అవార్డ్ ఏదైనా ఉంటే అది మన తెలంగాణ ముఖ్యమంత్రి కే సి ఆర్ కే దక్కేదన్నారు. ఇది నీతికి అవినీతికి మధ్య పోరాటమని అందుకే వారి అవినీతిపై ఛార్జ్ షీట్ విడుదల చేశామన్నారు. ఈ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థుల, కార్యకర్తల విజయం తథ్యమని ఆయన తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో దుబ్బాక ఎం ఎల్ ఏ రఘునందన్ రావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రేమేందర్ రెడ్డి, బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి తోపాటు పలువురు బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన కే యస్ జి యువసేన



గుమ్మడిదల,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:కష్టం అంటూ తలుపు తడితే సాయం చేసే మనసున్న మారాజు నమ్ముకున్న వారిని చేరదిసే తత్వం మంచికి మారుపేరు పటాన్ చేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కాట శ్రీనివాస్ గౌడ్, కరోనా మహమ్మారి నుండి తొందరగా కోలుకోవాలని ప్రఖ్యాత ప్రసిద్ధి గాంచిన సికింద్లాపూర్ శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవాలయంలో గుమ్మడిదల మండలం కే యస్ జి యువసేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు,ఈ సందర్భంగా కే యస్ జి యువసేన సభ్యులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ నేను ఉన్న అంటూ నిత్యం ప్రజల కోసం పాటుపడే నాయకుడు కాట శ్రీనివాస్ గౌడ్ అని ఆ భగవంతుడు ఆయనకు ఆయు ఆరోగ్యాలు ప్రసాదించి తొందరగా కోలుకోవాలని శ్రీ లక్ష్మి నరసింహ స్వామిని కోరుకుంటునమన్నారు. ఈ కార్యక్రమంలో కే యస్ జి యువసేన సభ్యులు పోతరాజు సుధాకర్, ఆర్ మల్లేష్, పి శ్రీను, యన్ శివ, సూరి, ప్రేమ్ కుమార్, జీవన్, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## మత్స్యగిరి ఆలయంలో ఈనెల 27న స్వాతి కళ్యాణం

వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి న్యూస్ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పరిధిలోగల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో ఈ నెల 27 న మంగళవారం స్వాతినక్షత్రం సందర్భముగా స్వామివారి కళ్యాణం అర్చకులచే అంతరంగికముగా నిర్వహించడం జరుగుతుందని భక్తులు సహకరించగలరని ఆలయ కార్యనిర్వహణాధికారి కె రవి కుమార్,ధర్మకర్తల మండలి చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి లు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

## శ్రీశైలంలో కరోనా ఆంక్షలు

కర్నూలు: శ్రీశైలంలో కరోనా ఆంక్షలు విధించారు. కరోనా కారణంగా భక్తుల రద్దీ తగ్గింది. దీంతో క్యూలైన్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకే షాపులు తెరవాలని అధికారులు ఆంక్షలు విధించారు. దర్శనాలకు వచ్చే భక్తులు తప్పనిసరిగా మాస్క్ ధరించడం, భౌతికదూరం పాటించే చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. అదే విధంగా దర్శన ప్రవేశ ద్వారం వద్ద భక్తుల శరీర ఉష్ణోగ్రతలను పరీక్షించిన తరువాతనే దర్శనానికి అనుమతిస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర పరిధిలో కరోనాను అరికట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు చేతులు శుభ్రం చేసుకొనేందుకు, శానిటైజేషన్ చేసుకొనేందుకు క్యూలైన్ల ప్రవేశాల వద్ద శానిటైజర్లు ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నారు.



## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి హరీష్ రావు







సిద్దిపేటఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:సిద్దిపేట మున్సిపల్ ఎన్నికలలో భాగంగా 17వ వార్డ్ టి ఆర్ ఎస్ అభ్యర్థి తరపున మంత్రి హరీష్ రావు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలికి మట్టి అంటకుండా రోడ్లు వేశామని,ఈ వార్డ్ లో ఎవరూ కూడా ఇల్లు లేనివారు ఉండవద్దని,ఓట్ల కోసం వచ్చే వాళ్ళు కావాలో ఆపదలో మీ వెన్నంటి సహాయసహకారాలు అందించేవారు కావాలో మీరే నిర్ణయించు కోవాలి అన్నారు. ఒకనాడు సిద్దిపేటలో నీళ్ల కోసం చాలా గోస పడ్డామని,సిద్దిపేట అబ్బాయికి పిల్లనివ్వాలంటే నీళ్ల గోస చూసి వెనుకంజ వేసేవారని, నాడు సిద్దిపేట పందులకు ప్రసిద్ధి అని నేడు అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా మారిందన్నారు. పట్టణంలో కోతులు,దోమల బెడదలు తీరాయన్నారు. టి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులకు తప్ప డూప్లికేట్ వాళ్ళకు ఓటు వేయొద్దని,పగటి వేషగాల్లను నమ్మొద్దన్నారు.

## రాష్ట్రానికి మార్గదర్శిగా నిలవాల్సిన ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇప్పటివరకు కోవిడ్ వ్యాక్సిన్ తీసుకోకపోవడం బాధాకరం



జిన్నారం, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:రాష్ట్ర ప్రజలకు భరోసా కలిగించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వాళ్ళ కుటుంబ సభ్యులు ఇప్పటి వరకు వ్యాక్సిన్ తీసుకోకపోవడం బాధాకరం మరియు రాష్ట్ర ప్రజలకు టీకా తీసుకోవడం వల్ల అనేక అపోహలు కలుగుతున్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్ వాళ్ళ కుటుంబ సభ్యులు తీసుకుంటేనే ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి తీసుకుంటారని జిన్నారం కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు యనగండ్ల నరేందర్ అన్నారు,అయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు ఎంపీ సంతోష్ రావు గ్రీన్ చాలెంజ్ అని చెట్లు నాటి ఛాలెంజ్ విసిరిన ఎంపీ మరి ఇప్పుడున్న కరోనా మహమ్మారి తరిమేందుకు వ్యాక్సిన్ చాలెంజ్ లు ఎందుకు విసరడం లేదని రాష్ట్ర ప్రజల తరుపున ప్రశ్నిస్తునమన్నారు, అలాగే 25 వందల కోట్లతో ఉచితంగా టీకా ఇస్తున్నందుకు సంతోషమే కానీ బాధ్యతగల పదవిలో ఉండి మీరే తీసుకోకపోతే దానిపై అపోహాలో ఉన్న యువకులు ఎలా తీసుకుంటారాని. కాబట్టి రాష్ట్రంలోని ముఖ్యమంత్రి నుంచి జిల్లా నాయకుని వరకు వ్యాక్సిన్ అపోహలు లేకుండా ముందుగా వారే తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నియోజకవర్గస్థాయిలో మండల స్థాయిలో గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు వ్యాక్సిన్ తీసుకొని ప్రజలకు ఆదర్శంగా నిలవాలని కోరుకుంటునమని, ఎందుకంటే గ్రామ స్థాయిలో అనేక అపోహలు తీవ్రంగా వ్యక్తం అవుతున్న సందర్భంలో ప్రజాప్రతినిధులు ముందుగా వ్యాక్సిన్ తీసుకుంటే ప్రజల ముందుకు వచ్చి వ్యాక్సిన్ తీసుకునే ధైర్యం చేస్తారని గ్రామాలను రాష్ట్రాన్ని దేశాన్ని కరోనా రహితంగా దేశంగా మార్చడానికి మన వంతు కృషి మనం చేయాలని కోరుకుంటున్నాం అన్నారు.

## శ్రీ భగవాన్ సత్యసాయి సేవాసమితి చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్ చేరు, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు శ్రీ భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పటాన్చెరు బస్టాండ్ లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రశంసించారు. ఆయన ఆదివారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్య సాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు భక్తి భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు రూపొందించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్, నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



## టి. రామ్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

పరిగి, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: పరిగి నియోజక వర్గం పూడూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేవ నోని గూడెం గ్రామంలో వికారాబాద్ జిల్లా ను జోగులాంబ జోన్ నుండి చార్మినార్ జోన్ లోకి మార్చడానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు రాస్తారోకోలు ధర్నాలు చేసి కీలక పాత్ర పోషించి విజయం సాధించిన వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిగి మాజీ ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి కి పాలాభిషేకం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్ పూడూరు మండల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సల్మాన్ మొయిన్, నారాయణ, రామ్ చందర్ కాటన్ రామచంద్రయ్య, అంజయ్య యాదయ్య విజయ్ కుమార్ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చిత్రానికి పాలాభిషేకం



పరిగి, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చిత్రానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాను జోగులాంబలో కలిపిన టిఆర్ఎస్ ప్రభుత్వంపై ఎన్నో అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలు చేసి వికారాబాద్ జిల్లా అంటే రాష్ట్ర ప్రభుత్వానికి చెమటలు పట్టేలా జిల్లా నాయకులు అందర్నీ చైతన్యవంతం చేసి కలిసికట్టుగా పోరాటం చేసి వికారాబాద్ జిల్లాను చార్మినార్ జోన్లో కలిపినందుకు కృషి చేసిన రామ్మోహన్ రెడ్డికి వికారాబాద్ జిల్లా ప్రజలు యువకులు ఉద్యోగులు ప్రతి ఒక్కరు కూడా రుణపడి ఉంటారు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు వెంకటేష్ పరిగి మండల కోశాధికారి ఈశ్వర్ ఆచారి ,యువజన కాంగ్రెస్ పరిగి మండల అధ్యక్షుడు పి నాగవర్ధన్, గ్రామ వార్డు మెంబర్ రవీందర్ రెడ్డి ,బూత్ కమిటీ సభ్యులు శేఖర్, బుగ్గ రాములు, రాకేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సర్కారు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టడం అభినందనీయం:టీఆర్ఎస్ జిల్లా యువత అధ్యక్షులు వేంకటేశం గౌడ్



జిన్నారం, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:రాష్ట్రంలో ప్రాణవాయువు కొరత ఏర్పడకుండా తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందని టీఆర్ఎస్ జిల్లా యవత అధ్యక్షులు వేంకటేశం గౌడ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ వయసుతో సంబంధం లేకుండా ఉచితంగా వ్యాక్సిన్ ఇవ్వాలని గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం పట్ల టీఆర్ఎస్ జిల్లా యువత అధ్యక్షులు వేంకటేశం గౌడ్ హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు నాలుగు కోట్ల మందికి రూ.2,500 కోట్ల ఖర్చుతో వ్యాక్సినేషన్ చేపడతామని సీఎం కేసీఆర్ వెల్లడించడం సంతోషకరం ఆయన తెలిపారు,ప్రజల ప్రాణాల కంటే డబ్బు ముఖ్యంకాదని, అందరికీ ఉచితంగా టీకా ఇవ్వాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ ముందడుగు వేశారని ఆయన అన్నారు.

## మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంచినీటి వసతి ఏర్పాటు అభినందనీయం:మండల ప్రెస్ క్లబ్ కన్వీనర్ కానం శేఖర్

ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:గుమ్మడిదల గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మైత్రీ ఫౌండేషన్ మంచినీటి వసతి ఏర్పాటు చేయడం అభినందనీయమని మండల ప్రెస్ క్లబ్ కన్వీనర్ కానం శేఖర్ పేర్కొన్నారు. ఆదివారం నాడు గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే కరోన పరీక్షల కొరకు,కరోన టీకాలు వెయుంచుకునేందుకు వచ్చే ప్రజాల దాహార్తి తీర్చేందుకు మంచినీటి వసతి ఏర్పాటు చేశారు. ముఖ్య అతిధిగా కానం శేఖర్ హాజరై చలివేంద్రం ప్రారంభించారు. మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయకుమార్ మాట్లాడుతూ అన్నారం గ్రామ సర్పంచ్ తిరుమల వాసు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, అన్నారం గ్రామ పంచాయతీకి ప్రత్యేక అంబులెన్స్ ఉన్నప్పటికి వారు మైత్రీ ఫౌండేషన్ అంబులెన్స్ కు నెలనెలా ఐదు వేల రూపాయలు గౌరవ వేతనం ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది సుబ్రమణ్యం, ముజీబ్,మైత్రీ ఫౌండేషన్ సభ్యులు వ్యాకాల మహేష్ కుమార్ కుంటి మలేష్,సూర్యనారాయణ,కంది రాము, నవీన్ సాగర్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.






## కరోనా రోగులకు వరంగా ఈ పరికరం

కరోనా వచ్చిన వారు ఆసుపత్రిపాలు కాకుండా ఉండాలి అంటే రక్తంలో ఆక్సిజన్ మోతాదు 94 శాతానికి తగ్గకుండా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. రక్తంలోని ఆక్సిజన్ మోతాదును పల్స్ అక్షీమీటర్ తో గుర్తించవచ్చు.. కానీ ఒకేసారి ఆక్సిజన్ లెవల్స్ పడిపోతే ఆసుపత్రికి తీసుకెళ్లక తప్పని పరిస్థితి.అయితే డీఆర్డీవో పుణ్యమా అని ఇప్పుడు ఆ సమస్యకు పరిస్కారం దొరకనుంది. దేశ సరిహద్దుల్లో ఎత్తైన ప్రాంతాల్లో విధులు నిర్వహించే జవాన్లకు ఆక్సిజన్ అందించేందుకు డీఆర్డీవో ఓ పరికరం తయారు చేసింది. ఇది కరోనా బాధితులకు వరంలా మారనుంది. ఈ పరికరం రక్తంలోని ఆక్సిజన్ లెవల్స్ ను గుర్తించి తక్కువ ఉంటే తగిన మోతాదులో అందిస్తుంది.ఆక్సిజన్ సిలిండర్ కు అనుసంధానంగా ఉండే ఈ పరికరం కరోనా రోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ముంజేతికి కట్టుకునే ఓ పరికరం ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఆక్సిజన్ సరఫరా చేస్తుంటుంది. దీంతో వైద్య సిబ్బందిపై ఒత్తిడి తీవ్రంగా తగ్గుతుంది. కాగా ఈ పరికరాన్ని బెంగళూరులోని డీఆర్డీవోకు చెందిన 'ది డిఫెన్స్ బయో ఇంజినీరింగ్ అండ్ ఎలక్ట్రో మెడికల్ లేబొరేటరీ' తయారుచేసింది. దీనికి 'ఎస్పీవో%--%2 సప్లిమెంటల్ ఆక్సిజన్ డెలివరీ సిస్టం' పేరుపెట్టారు.ఈ పరికరానికి ఒక లీటర్ నుంచి మొదలుకొని 1,500 లీటర్ల ఆక్సిజన్ను సరఫరా చేయగల సామర్థ్యం ఉంటుంది. కోవిడ్ రోగులకు ఇళ్లలోనే చికిత్స అందించే సందర్భాల్లో ఈ యంత్రం ఉపయుక్తంగా ఉంటుందని డీర్డీవో ఓ ప్రకటనలో తెలిపింది.

## మార్చురీలో పేరుకుపోతున్న శవాలు

### ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా మరణ మృదంగం

విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి: కరోనా సెకండ్ వేవ్ ఏపీలో మరణ మృదంగా మోగిస్తోంది. రోజువారీగా వేలకు పైగా కేసులు నమోదవుతుండటంతో పాటు మరణాల సంఖ్య కూడా బీభత్సంగా పెరుగుతోంది . ముఖ్యంగా విజయవాడలోని జీజీహెచ్ హాస్పిటల్ లో కొవిడ్ రోగుల సంఖ్య క్రమేపి పెరుగుతోంది. విజయవాడలో ఆక్సిజన్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీంతో చాలా మంది కొవిడ్ రోగులు పిట్టల్లా రాలిపోతున్నారు. జీజీహెచ్ లో ప్రాణవాయువు నిల్వ శాతం తగ్గిపోవడంతో మరణాల సంఖ్య పెరుగుతున్నట్లు సమాచారం. అయితే, మరణించిన వారి మృతదేహాలను కలెక్ట్ చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో జీజీహె లోని మార్చురీలో శవాల గుట్టలు పేరుకుపోతున్నాయి.నాలుగు రోజుల నుంచి సుమారు 81 మృతదేహాలు మార్చురీలోని ఒక దగ్గర కుప్పగా చేశారు. నార్మల్ గా జీజీహెచ్లో 50 మృతదేహాలు పెట్టే వీలుంది. రెండు, మూడు రోజులుగా మరణించిన వారి కోసం బంధువులు రావడం లేదు. దీంతో మార్చురీ సిబ్బంది వారి కోసం ఎదురు చూస్తున్నారు. నిర్ణీత సమయం వరకు రాకపోతే మార్చురీ సిబ్బంది శవాలను కార్పొరేషన్కు అందజేస్తున్నారు. ఒక్క విజయవాడలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఇంకెలాంటి పరిస్థితి ఉందో అర్థం చేసుకోవచ్చు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కోవిడ్ చికిత్సకు అనుమతి ఇవ్వాలి

### అంచుల నరసింహారావు రాజుపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు



రాజుపాలెం,ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: కరోనా వైరస్ భారిన పడి రాజుపాలెం మండల పరిధిలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు పేషెంట్స్ కు చికిత్స అందించేందుకు రాజుపాలెం మండల కేంద్రంలో ఉన్న %ూఎజ% హస్పిటల్స్ నుతక్షణమే కరోనా ట్రీట్మెంట్ చేయుటకు అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, సంభంధిత శాఖలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.లిపేదలకు ఆరోగ్య శ్రీపై కరోనా ట్రీట్మెంట్ ఉచితంగా వైద్యం అందించాలి.లిఒక్క సత్తెనపల్లి నియోజకవర్గ పరిసరాలలోని అన్ని మండలాల్లో ని హస్పిటల్స్ కు కోవిడ్ ట్రీట్మెంట్ కు అనుమతులు మంజూరు చేయాలి. వైద్యులు ను నియమించాలని. లికరోనాపాజిటీవ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కోవిడ్ ట్రీట్మెంట్ కు హస్ఫటల్స్ అత్యవసరంజిల్లా కలెక్టర్ గారు,జిల్లా వైద్యశాఖ అధికారి సత్తెనపల్లి శాసన సభ్యులు, యం.పి. ప్రత్యేక శ్రద్ధ చూపి సత్తెనపల్లి పట్టణంలో ఎలిజిబులిటీ ఉన్న హస్ఫటల్స్ కు కోవిడ్ ట్రీట్మెంట్ అనుమతులు మంజూరు చేసేవిధంగా క్రృషి చేయాలని సతైనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ తరుపున డిమాండ్ చేయడమైనది.

## కుక్కలతో మండల ప్రజలు బేజారు



బెల్లంకొండ: (ప్రజా పాలన) మండలంలోని అనేక గ్రామాల లో కుక్కల బెడద పెరగడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు ఆ గ్రామం ఈ గ్రామం అనే తేడా లేకుండా ఏ వీధిలో చూసినా గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు పంచాయితీల పరిధిలో వందల కొద్ది కుక్కలు ఉన్నట్లు అయితే వీటి నియంత్రణ కు సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు తాజాగా గత రెండు రోజుల క్రితం పాపయపాలెం గ్రామనికి చెందిన ముగ్గురు కూలిలు ద్విచక్ర వాహనం మీద పనుల నిమిత్తం రాజుపాలెం మండలనికి వెళుతుండగా మండల కేంద్రంలో చర్చి మూల మలుపు వద్ద జరిగిన ఘటన లో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన పాఠకులకు విధాత మే అందుకు కారణం అక్కడ ఉన్న కుక్కలే అదే విధముగా బెల్లంకొండ నుండి కొత్తపాలెం గ్రామానికి వెళ్లే దారిలో పి ఏ సి ఎస్ ఆఫీస్ దగ్గర పదుల సంఖ్యలో కుక్కలు ఉ ండటంతో కొత్తపాలెం గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు గ్రామానికి వెళ్లేటప్పుడు అధిక సంఖ్యలో ద్విచక్ర వాహనల మీదకు వెంబడించి కరుస్తున్నాయని ఆవేదనతో చెబుతున్నారు గ్రామాలలో చిన్న పిల్లలపై కుక్కలు దాడులు చేస్తున్నాయని తల్లులు ఆవేదన చెందుతున్నారు ఇకనైనా వార్డు వాలంటీర్ వార్డ్ మెంబర్స్ గ్రామ సచివాలయ సెక్రటరీ గ్రామ సర్పంచులు ఆయా గ్రామాల మీద చొరవ తీసుకుని కుక్కల బెడద లేకుండా చేయాలని వివిధ గ్రామాల మహిళలు అధికారులు కోరుతున్నారు

# జిల్లాలో 42 హాస్పిటల్స్‌లో 3500 బెడ్లు సిద్ధం:మంత్రి వెలంపల్లి



## 104కి కాల్ చేసిన నాలుగు గంటల్లో పరిష్కారం
## 104 కంట్రోల్ రూం సేవలు బలోపేతానికి చర్యలు

విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి: సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 104 కమాండ్ కంట్రోల్ రూంను అధికారులతో కలిసి దేవాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం ఉదయం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో 104 కంట్రోల్ రూం సేవలను బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. 104 కంట్రోల్ రూం పని తీరును జిల్లా కోవిడ్ నోడల్ అధికారి శివశంకర్ మంత్రికి వివరించారు. మూడు షిఫ్టుల్లో దాదాపు 80 మంది సిబ్బంది 24 గంటలు సేవలు అందిస్తున్నారన్నారు. అదే విధంగా ఆసుపత్రుల్లో బెడ్లు ,వైద్య సలహాలు, సందేహాలు కూడా నివృత్తి చేస్తున్నారన్నారు. 104 కాల్ సెంటర్ ద్వారా మొబైల్ కోవిడ్ టెస్టులు నిర్వహించేలా ఏర్పాటు చేసినట్లు వివరించారు. కోవిడ్ సెకండ్ వేవ్ ఉపద్రవంలా వచ్చిందని, ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ముందు చూపుతో దానిని సమర్థంగా ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. జిల్లాలో 42 హాస్పిటల్స్ లో 3500 బెడ్లు సిద్ధంగా ఉన్నాయని, కోవిడ్ కేర్ సెంటర్ లలో 2500 బెడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వాటి వివరాలు ఎప్పటికప్పుడు పబ్లిక్ డొమైన్‌లో పెడుతున్నారు. 104కి కాల్ చేసిన నాలుగు గంటల్లో పరిష్కారం అవుతుందన్నారు. ధైర్యంగా ఉంటే కోవిడ్‌ని సగం జయించినట్టే అన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పేర్కొన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎక్కడా వెనకంజ వేయొద్దని సీఎం జగన్ ఆదేశించినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఏపీలో మెరుగైన సేవలు అందిస్తున్నాము. కోరోనా ని కూడా రాజకీయం చేయడం చంద్రబాబుకు తగదు అన్నారు. మంచి గురించి మాట్లాడే అలవాటు లేని చంద్రబాబు ప్రజలని భయపెట్టేలా మాట్లాడుతున్నారు. హైదరాబాద్‌లో కూర్చొని రాజకీయాలు చేయడం బాబు అలవాటే అన్నారు.

## మలేరియా రహిత సమాజమే లక్ష్యం




బెల్లంకొండ: (ప్రజా పాలన) ఏప్రిల్ 25వ తేదీ ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆదివారం మలేరియా వ్యాధిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సును ఉద్దేశించి ఆరోగ్య విస్తరణ అధికారి శిఖ సాంసన్ మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రత పాటించాలని దోమతెరలు వాడాలని రెండు రోజులకు మించి జ్వరం వస్తే సమీప ఆరోగ్య కేంద్రంలో సచివాలయంలో ఏఎన్ఎం కు ఆశ వర్కర్లకు సంప్రదించాలన్నారు రోజు విడిచి రోజు జ్వరం రావటం చలితో జ్వరం తలనొప్పి ఒళ్లు నొప్పులు చెమటలు పట్టడం పళ్ళు కొరుక్కోవడం మూత్ర విసర్జన తగ్గటం మలేరియా వ్యాధి లక్షణాల ని పేర్కొన్నారు 50 ఏళ్లు పైబడిన వృద్ధుల్లో చిన్నారులలో గర్భిణీ స్త్రీలలో హెచ్.ఐ.వి వ్యాధితో జీవించే వారిలో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని సాంసన్ తెలిపారు కొన్ని రకాల మలేరియా వల్ల మెదడు మూత్రపిండాలు కాలేయం దెబ్బతింటాయని అవయవాలకు వ్యాధి లక్షణాలు కనిపిస్తే అతి ప్రమాదకరమైన మలేరియా గా భావించాలి అన్నారు తొలిదశలోనే మలేరియా పరీక్షలు చేయించుకోవాలన్నారు దోమల నిర్మూలన లతోనే మలేరియా వ్యాధిని నివారించవచ్చు అని దోమల నివారణ కై అందరు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి అన్నారు దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలు వెంటిలేటర్ లకు టాయిలెట్లు పైపులకు దోమతెరలు అమర్చుకోవాలని పూల కుండీలు నీళ్లు ఎప్పటికప్పుడు మార్చుకోవాలని టైర్లు పగిలిన బాటిల్స్ ప్లాస్టిక్ సంచులు టెంకాయలు టీ ప్లాస్టిక్ కప్పులు పగిలిన కొండలలో వీటిలో నీళ్లు నిలిపివేస్తే అవి దోమల అభివృద్ధికి కారణం అవుతాయి కావున ఇంట్లో కాని ఇంటి చుట్టు కాని ఎటువంటి వస్తువులు లేకుండా వాటిలో నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్ వేస్ట్ ఆయిల్ వాహనాలు బాగు చేసిన ఆయిల్ మడ్డి ఆయిల్ చల్లితే లార్వాలు పెరగవు అనే సాంసంగ్ వివరించారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు వై. పాప పి.రాధా లక్ష్మి బి ఆశా వర్కర్లు పాల్గొన్నారు

## విద్యుత్ బిల్లులు ఆన్లైన్లో చెల్లించండి

### విద్యుత్ శాఖ- ఏ ఈ ఈ- లక్ష్మణ్ నాయక్



బెల్లంకొండ: ( ప్రజా పాలన) మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ విద్యుత్ బిల్లులు మోటర్ బిల్లులు ఆన్లైన్ లో గాని ఫోన్ పే గూగుల్ పే ద్వారా చెల్లించాలని బెల్లంకొండ మండల విద్యుత్ శాఖ అధికారి లక్ష్మణ్ నాయక్ ఆదివారం నాడు తెలిపారు కరోనా సెకండ్ వేవ్ చాపకింద నీరులా విస్తరించి ఉండటం వలన ఈ విధమైన నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారు ఆన్లైన్ సర్వీస్ లో మీ బిల్లులను పే చేసి తమ యొక్క సమస్త కు సహకరించి తమతమ బిల్లును ఆన్లైన్లో చెల్లించి సంస్థకు శ్రేయస్సు దృష్ట్యా ఆన్లైన్లో చెల్లించాలని కోరారు ఆన్లైన్లో చెల్లింపు వలన అనేకమైన ప్రయోజనాలు కలుగుతాయని ఈ క రోనా కష్టకాలంలో మీరు బయటికి వెళ్లకుండా ఎక్కువ మంది ఎక్కువ శాతం ఆన్లైన్లో చెల్లించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు ఒక నెల బిల్లు చెల్లించకపోతే ఆ బిల్లు మీద అధిక రుసుం తీసుకోవటం జరుగుతుందని బిల్లులు కట్టడం లో నిర్లక్ష్యం చేయరాదని వారు కోరారు.అదే విధముగాతమ ఇంటి లోపల ఉన్న విద్యుత్ మీటర్లను బయట బిగించుకోవాలని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంలో విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తున్నందున ఇళ్లల్లోకి రాకుండా బయట నుండి తీసుకోవటం జరుగుతుందని మండల ప్రజలు తమ సిబ్బందికి సహకరించి ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో ఉన్న విద్యుత్ మీటర్లు బయట బిగించే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండండి భౌతిక దూరం పాటిస్తూ మాస్కు ధరించాలి:మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి






నరసరావుపేట, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి: పట్టణంలో ప్రతి ఒక్కరు కుటుంబాలతో జాగ్రత్తగా ఉండాలని భౌతిక దూరం పాటిస్తూ మాస్క్ ధరించాలని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు ఆదివారం పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కమిషనర్ కె. రాంచంద్రారెడ్డి మార్నింగ్ విజిట్ లో భాగంగా 17వ వార్డు, వరవకట్ట పరిసర ప్రాంతాల్లో పర్యటన చేయుడం జరిగింది. ఈ సందర్భంగా వార్డ్ ప్రజలను శానిటేషన్ మరియు వాటర్ సప్లై సంబంధించిన ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వార్డు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మాస్కులు ధరిస్తూ, తరచుగా చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కుంటూ వీలైనంత వరకు ఇంట్లో కూడా మాస్క్ ధరిస్తూ భౌతిక దూరం పాటించడంవల్ల ఈ కరోనా మహమ్మారి బారిన పడకుండా ఉండగలమని గత సంవత్సరం కూడా ఈ పరిసర ప్రాంతాలు నందు ఈ కరోనా యొక్క వ్యాప్తి ఎక్కువగా జరిగి చాలా ఇబ్బందులు అయినారు కాబట్టి గత సంవత్సర అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకుంటూ పురపాలక సంఘం వారికి సహకరించాలని తెలియజేశారు.

అదేవిధంగా పట్టణంలో అన్ని ప్రాంతాల నందు బ్లీచింగ్ పౌడర్ మరియు సోడియం హైపోక్లోరైట్ ప్రతిరోజు చేయించాలని కేసులు ఎక్కువ ఉన్న ప్రాంతంలో శానిటేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని శానిటేషన్ అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 17వ వార్డు ఇంచార్జి నాగూర్ వలి (వరకట్ట బాబు) , ఇన్చార్జి శానిటేషన్ ఇన్స్పెక్టర్ వెంకట స్వామి , సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధూళిపాళ్ల సమగ్ర విచారణ జరగాలి:వైకాపా కౌన్సిలర్లు



పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి:సంగం డెయిరీ అవినీతి వ్యవహారం లో ఏసీబీ వలలో చిక్కుకున్న డెయిరీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పై సమగ్ర విచారణ జరగాలని పొన్నూరు మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ధూళిపాళ్ల అవినీతి,అక్రమాలు,దౌర్జన్యం పరాకాష్ట కు చేరుకున్నాయన్నారు.తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి సంక్షేమ నిధులను దారి మళ్లించడం ద్వారా కోట్లాది రూపాయలు స్వాహా చేశారన్నారు.పాల ఉత్పత్తి దారుల పొట్టగొట్టిన ధూళిపాళ్ల ఎందరో అమాయకుల పై అక్రమ కేసులు బనాయించి వారి కుటుంబాలకు తీరని వ్యధను మిగిల్చి పెట్టారన్నారు.సమావేశంలో మాజీ కౌన్సిలర్లు బోయిన శివ నాగరాజు, షేక్ షర్మిల, ముకిరి అనిల్ కుమారి,కమలమ్మ, షేక్ నాజర్, మొల్లా కరీం,గెరా కుమారి,గెరా సంజీవ్, షేక్ నాయీమ్ బాషా,తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర కుటుంబానికి ఎమ్మెల్యే పయ్యావుల పరామర్శ



పొన్నూరు, ప్రజా పాలన ప్రతినిధి:సంగం డెయిరీ అవినీతి కేసులో ఏసీబీ కు పట్టుబడిన పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ కుటుంబాన్ని ఆదివారం పొన్నూరు మండలంలోని చింతలపూడి గ్రామంలో వులవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పరామర్శించారు.నరేంద్ర సతీమణి జ్యోతిర్మయి ని ఓదార్చారు. ఆయన కు తెలుగుదేశం పార్టీ అండదండలు వుంటాయని త్వరలో బెయిలు మీద బయటకు వస్తారని భరోసా ఇచ్చారు.

## అంజి రెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించిన శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి






నరసరావుపేట, ఏప్రిల్ 25, ప్రజాపాలన ప్రతినిధి:నరసరావుపేట పట్టణం నందు స్థానిక సత్తెనపల్లి రోడ్ నందు నూతనంగా నిర్మితమైన అంజిరెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నరసరావుపేట శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు.హాస్పిటల్ నందు ప్రత్యేక ఆకర్షణ గా నిలిచిన తిరుమల తిరుపతి దేవస్థానముల చైర్మన్ శ్రీ వై వి సుబ్బారెడ్డి మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి . ఈ కార్యక్రమంలో డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ డాక్టర్స్ సిబ్బంది పాల్గొన్నారు.



# పాన్ ఇండియా ప్రభాస్ తో పాన్ వరల్డ్ మూవీ..!



పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ – 'మహానటి' ఫేమ్ నాగ్ అశ్విన్ కాంబినేషన్ లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీ దత్ భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. ఈ చిత్రానికి లెజండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాస్ మెంటర్ గా వ్యవహరిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొనే హీరోయిన్ గా నటిస్తుండగా.. బిగ్ బీ అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర పోషించనున్నారు. సైన్స్ ఫిక్షన్ జోనర్ లో స్టార్ క్యాస్టింగ్ తో హై టెక్నికల్ వాల్యూస్ తో ఈ సినిమా రూపొందనుంది. అయితే ప్రభాస్ తో నాగ్ అశ్విన్ బిగ్గెస్ట్ పాన్ వరల్డ్ మూవీని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతవరకు ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై రాని కథాంశంతో ఈ సినిమా తెరకెక్కనుంది. అందుకోసమే ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ కి ఎక్కువ సమయం పడుతోందని సమాచారం. 'బాహుబలి' సినిమా తర్వాత అన్నీ పాన్ ఇండియా సినిమాలు చేస్తున్న ప్రభాస్.. నాగ అశ్విన్ తో చేయబోయే సినిమాతో పాన్ వరల్డ్ ని టార్గెట్ చేయనున్నాడు. భారతీయ భాషలతో పాటు పలు విదేశీ భాషల్లో కూడా ఈ చిత్రాన్ని విడుదల చేస్తారు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'ఆదిపురుష్' 'సలార్' సినిమాల షూటింగ్స్ పూర్తైన వెంటనే నాగ్ అశ్విన్ ప్రాజెక్ట్ సెట్స్ మీదకు వెళ్ళే అవకాశం ఉంది. ఈ సినిమా కోసం ప్రభాస్ ఎక్కువ డేట్స్ కేటాయించినట్లు తెలుస్తోంది.

# ప్రపంచ దేశాల్ని అట్టుడికిస్తున్న వైల్డ్ డాగ్!




కోవిడ్ 19 సెకండ్ వేవ్ విదేశాల్లో స్ట్రెయిన్ రూపంలో అట్టుడికిస్తోంది. కానీ ఇప్పుడు అంతకుమించి మరొకటి అంటుకుంది. అదే కింగ్ నాగార్జున నటించిన వైల్డ్ డాగ్. ఓవైపు కోవిడ్19 కల్లోలం కొనసాగుతున్నా వైల్డ్ డాగ్ చిత్రబృందం అనుకూల పరిస్థితులలో ఈ చిత్రాన్ని వివిధ ప్రదేశాలలో చిత్రీకరించి థియేటర్లలోకి తెచ్చారు. గొప్ప రివ్యూలు అందుకుని సెకండ్ వేవ్ ప్రభావంతో బాక్సాఫీస్ వద్ద చతికిలబడిన సినిమాగా నిరాశపరిచింది. కరోనా కేసుల పెరుగుదల కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతాలు చేయలేకపోయింది. కానీ ఇప్పుడు నెట్ ఫ్లిక్స్ లో నాలుగు దక్షిణ భారత భాషల్లో విడుదలైన ఈ చిత్రం ఓటీటీల్లోనే అగ్రస్థానంలో నిలిచింది. భారతదేశంలోనే కాదు అమెరికా.. బ్రిటన్–మలేషియా– సింగపూర్ – బంగ్లాదేశ్– సింగపూర్ మరికొన్ని దేశాలలో వైల్డ్ డాగ్ ట్రెండింగ్ లో ఉంది. బాంబ్ బ్లాస్ట్ – తీవ్రవాదం నేపథ్యంలోని కంటెంట్ యూనివర్శల్ అప్పీల్ ని కలిగి ఉండడంతో ఇంత ఆదరణ దక్కుతోంది. వైల్డ్ డాగ్ లో ఆకర్షణీయమైన కథనం .. హై–ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. నాగార్జున తన అద్భుతమైన నటనకు ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రస్తుతం రెండవ వేవ్ కారణంగా ఓటీటీలకు ఆదరణ పెరిగింది. ఇది వైల్డ్ డాగ్ డిజిటల్ వీక్షణకు కలిసొస్తోంది. ఆషిషోర్ సోలొమన్ దర్శకత్వంలో మ్యాట్నీ ఎంటర్ టైన్ మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని తెరకెక్కించింది. థియేట్రికల్ రిలీజ్ అనంతరం కేవలం 19 రోజుల్లోనే నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ చేశారు. థియేట్రికల్ పరుగును నిలిపివేసిన కరోనా స్ట్రీమింగ్ ప్లాట్ ఫామ్ పై మిలియన్ల వీక్షణలతో ఈ చిత్రం ది బెస్ట్ గా నిలిచింది. ఓటీటీలో వైల్డ్ డాగ్ బంపర్ హిట్ గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆదరణ దక్కించుకుంటోంది. ఇది నాగార్జున సహా మ్యాట్నీ టీమ్ కు పెద్ద ఊరట.

# "ఆచార్య" లో ఆ భారీ సీక్వెన్స్ ను ఇలా తెరకెక్కిస్తున్నారా?




మెగాస్టార్ చిరంజీవి హీరోగా ప్రస్తుతం బ్లాక్ బస్టర్ దర్శకుడు కొరటాల శివ దర్శకత్వంలో "ఆచార్య" అనే భారీ బడ్జెట్ మల్టీ స్టారర్ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే ఈ సినిమాలో మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ ఓ కీలక పవర్ ఫుల్ పాత్ర చేస్తున్నాడని వచ్చిన వార్త తర్వాత ఈ సినిమా అంచనాలు మరో లెవెల్ కి వెళ్లాయి. అయితే చరణ్ ఉండేది కాసేపు అయినా తెరపై విధ్వంసం మాత్రం కొరటాల గట్టిగానే ప్లాన్ చేసారని తెలిసింది. అలా ధర్మస్థలి సెట్స్ లో ఓ రైన్ ఫైట్ ను ప్లాన్ చేసారని ఆల్రెడీ తెలిసిన విషయమే కానీ దానిని పగలు వ్యూ లో కాకుండా రాత్రి వ్యూలో తెరకెక్కిస్తున్నారని నయా గాసిప్. ఆల్రెడీ కొరటాల మరియు చరణ్ ల కెరీర్ లో సాలిడ్ రైన్ ఫైట్ సీక్వెన్స్ లు ఉన్నాయి. మరి ఇద్దరి కలయికలో ఎలాంటిది ఉంటుందో తెలియాలి అంటే ఇంకొన్నాళ్ళు ఆగాల్సిందే. మరి ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందిస్తుండగా మ్యాట్నీ ఎంటర్టైన్మెంట్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

# పెళ్ళై ఇద్దరు పిల్లలున్న హీరోయిన్ టాలీవుడ్ లో రీఎంట్రీ ఇస్తోందా..?



క్యూట్ హీరోయిన్ జెనీలియా సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోలతో నటించి స్టార్ స్టేటస్ అందుకుంది. 'బొమ్మరిల్లు' సినిమాలో హ హ హాసిని అంటూ తెలుగు ప్రేక్షకులకు పలకరించిన జెన్నీ.. 'సత్యం' 'సాంబ' 'ఆరెంజ్' 'సై' 'ఢీ' 'రెడీ' వంటి సినిమాలతో మెప్పించింది. అయితే తొలి హీరో రితేష్ దేశ్ ముఖ్ ను 2012లో పెళ్లాడి సినిమాలకు దూరమైంది. తెలుగులో చివరగా 'నా ఇష్టం' అనే సినిమా చేసిన జెనీలియా ప్రస్తుతం భర్తా పిల్లలతో ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. అయితే ఆమె మళ్ళీ సినిమాల్లోకి రీఎంట్రీ ఇస్తోందని ఎప్పటి నుంచో వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తన ఇద్దరు పిల్లలు కాస్త పెద్దవాళ్ళు అవడంతో జెనీలియా.. ఇప్పుడు సిల్వర్ స్క్రీన్ ఎంట్రీ ఇవ్వడానికి రెడీగా ఉందని తెలుస్తోంది. ఆ మధ్య టిక్ టాక్ చిట్ చాట్ లో తన భర్తతో కలిసి మరాఠీ సినిమా చేస్తానని చెప్పుకొచ్చింది. ఈ క్రమంలో జెన్నీ ని మళ్ళీ తెలుగు చిత్రాల్లో నటింపజేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. జెనీలియా తో సన్నిహితంగా ఉండే టాలీవుడ్ యువ హీరో రామ్ పోతినేని కూడా ఆమెను సినిమాల్లో నటింపజేసేలా ప్రోత్సహిస్తున్నారట. అయితే రామ్ నటించే సినిమాతోనే జెనీలియా రీ ఎంట్రీ ఉంటుందని లేటెస్టుగా టాక్ నడుస్తోంది. టాలీవుడ్ లో సాధారణంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు క్యారక్టర్ ఆర్టిస్టులుగా మారిపోతుంటారు. సమంత – కాజల్ వంటి హీరోయిన్లు వివాహం చేసుకున్న తర్వాత కూడా రాణిస్తున్నారు. అయితే ఇద్దరు పిల్లల తల్లైన జెనీలియా రామ్ సినిమాలో హీరోయిన్ అంటే నమ్మశక్యంగా లేదు.

# రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న బాలయ్య టీజర్..!



టాలీవుడ్ నటసింహం బాలయ్య సినిమాలంటేనే నందమూరి అభిమానులలో ఎక్కడలేని సందడి కనిపిస్తుంది. కేవలం పోస్టర్ వస్తేనే చాలు అనుకుంటున్న సమయంలో ఏకంగా విందు భోజనం పెట్టినట్లుగా టైటిల్ టీజర్ వచ్చేసరికి ఫ్యాన్స్ హడావిడి మాములుగా లేదు. అసలే బాలయ్య – డైరెక్టర్ బోయపాటి శీను సినిమాలకు ఉండే ఆ క్రేజ్ వేరు. ఇదివరకే ఇద్దరూ కలిసి సింహా లెజెండ్ సినిమాలతో రికార్డులు క్రియేట్ చేశారు. బోయపాటి అంటేనే ఊరమాస్ సినిమాలు.. ఊరమాస్ అంటేనే బోయపాటి అన్నట్లుగా బాలయ్యతో రూపొందిస్తాడు. అసలే రోర్ వీడియోతోనే అంచనాలు పెంచేసిన ఈ కాంబినేషన్.. ఇటీవల ఉగాది సందర్భంగా అఖండ అనే టైటిల్ తో పాటు టీజర్ విడుదల చేసి అభిమానులకు భారీ ట్రీట్ ఇచ్చారు. ప్రస్తుతం బాలయ్య అఖండ టీజర్ యూట్యూబ్ లో రికార్డు బ్రేకింగ్ వ్యూస్ సొంతం చేసుకుంటుంది. కేవలం విడుదలైన పదకొండు రోజుల్లోనే అఖండ టీజర్ సీనియర్ స్టార్ హీరోల టీజర్ల రికార్డులను క్రాస్ చేసేసింది. సౌత్ సూపర్ స్టార్ తలైవా రజినీకాంత్ నటించిన కబాలి సినిమా టీజర్ ఇప్పటివరకు 38మిలియన్స్ తో టాప్ లో ఉంది. ఇప్పుడు బాలయ్య అఖండ టీజర్ 39 మిలియన్స్ దాటి 40వైపు వేగంగా అడుగులు వేస్తోంది. అందుకు తగ్గట్టుగానే నందమూరి ఫ్యాన్స్ కూడా సోషల్ మీడియా వేదికగా అఖండ టీజర్ వైరల్ చేస్తున్నారు. ఈ సినిమాలో బాలయ్య డ్యూయెల్ రోల్ పోషిస్తుండగా.. ప్రగ్యాజైస్వాల్ కథానాయికగా నటిస్తోంది. మిర్యాల రవీందర్ రెడ్డి సినిమాను నిర్మిస్తున్నాడు. యంగ్ సెన్సేషన్ తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నాడు. మే 28న అఖండ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు కానీ ముందుముందు ఏదైనా మార్పు జరుగుతుందేమో చూడాలి.




# కీలక షెడ్యూల్ కంప్లీట్ చేసేసిన థలపతి విజయ్.!

కోలీవుడ్ సెన్సేషనల్ స్టార్ హీరో థలపతి విజయ్ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం "మాస్టర్" అటు తమిళ్ తో పాటుగా తెలుగులో కూడా మంచి విజయాన్ని నమోదు చేసుకుంది. మరి ఈ సినిమాతో మన దగ్గర కూడా మంచి మార్కెట్ ను కూడా విజయ్ సెట్ చేసుకున్నాడు. ఇక దీని తర్వాత విజయ్ అక్కడ మరో టాలెంటెడ్ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ మరో సాలిడ్ ప్రాజెక్ట్ ను స్టార్ట్ చేశారు. అయితే ఈ చిత్రం తాలుకా మొట్ట మొదటి కీలక షెడ్యూల్ ను మేకర్స్ కొన్ని రోజుల కితమే జార్జియా దేశంలో ప్లాన్ చేసారు. అయితే ఈ సీన్ భారీ యాక్షన్ సీక్వెన్స్ అని టాక్ ఉంది. మొత్తానికి ఈ షెడ్యూల్ ను విజయ్ విజయవంతంగా పూర్తి చేసేసి ఈరోజే చెన్నైలో అడుగు పెట్టాడు. ఇక ఈ భారీ చిత్రంకు మ్యూజిక్ సెన్సేషన్ అనిరుద్ సంగీతం అందిస్తుండగా సన్ పిక్చర్స్ వారు నిర్మాణం వహిస్తుంది.

# సక్సెస్ లేకున్నా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఎలా బాబు?



యంగ్ హీరోల్లో కొందరు వరుసగా మూడు నాలుగు సినిమాలు ఫ్లాప్ అయితే మళ్లీ కనిపించనంతగా వెనక్కు వెళ్లి పోతున్నారు. వారు మళ్లీ సినిమాల్లో నటిస్తారా లేదా అనే అనుమానం కూడా కలుగుతుంది. అలాంటిది కొన్ని సంవత్సరాలుగా కంటిన్యూస్ గా ఫ్లాప్ లు పడుతున్నా.. ఒక్క కమర్షియల్ హిట్ లేకున్నా కూడా హీరో ఆది సాయికుమార్ మాత్రం కెరీర్ ముందుకు సాగుతున్నాడు. ఇలా కొద్ది మంది హీరోలకు మాత్రమే జరుగుతుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు చెవులు కొరుక్కుంటున్నారు. ఆది సాయికుమార్ కు కమర్షియల్ హిట్ పడి ఎన్నాళ్లు అయ్యింది అనేది ఆయనకు అయినా గుర్తు ఉందో లేదో కాని ఆఫర్లు మాత్రం వరుసగా వస్తూనే ఉన్నాయి. ఇటీవలే శశి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆది అప్పుడే రెండు సినిమా లను లైన్ లో పెట్టాడు. శశి సినిమా కోసం పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కాని ఫలితం మాత్రం ఎప్పటిలాగే నిరాశ పర్చింది. కరోనా వల్ల శశికి మరింత నష్టం తప్పలేదు. అయినా కూడా ఆది ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. అలాగే ఆయనతో సినిమాలను నిర్మించేందుకు మేకర్స్ కూడా వెనుకంజ వేయడం లేదు. ఇటీవలే ఫ్లాప్ డైరెక్టర్ వీరభద్ర చౌదరి దర్శకత్వంలో ఆది సినిమా ఒకటి అఫిషియల్ గా అనౌన్స్ చేశారు. ఆ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతూ ఉండగానే మరో సినిమా ను ఆది సాయి కుమార్ పట్టాలెక్కించాడు. సస్పెన్స్ హర్రర్ కామెడీ 'అమరన్' (ఇన్ ది సిటీ చాప్టర్ 1) తో ఆది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. అమరన్ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభం అయ్యింది. ఈ సినిమాలో ఆదికి జోడీగా అవికా గౌర్ హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమా తో ఎస్ బాలవీర్ దర్శకుడిగా పరిచయం అవ్వబోతున్నాడు. ఈ సినిమా స్క్రిప్ట్ వర్క్ ను దాదాపుగా రెండేళ్ళు చేసినట్లుగా మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా తో పాటు సమాంతరంగా వీరభద్రం సినిమాను చేయబోతున్నారు. అమరన్ చాప్టర్ 1 అంటూ చెప్పడం వల్ల దీనికి సీక్వెల్ కూడా వచ్చేలా ఉందనిపిస్తుంది. భారీ ఎత్తున విజువల్ ఎఫెక్ట్స్ తో ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఆది గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ సినిమాలో కనిపిస్తాడని చెబుతున్నారు. ఆది ప్రతి సినిమాలో కొత్తగానే కనిపిస్తున్నాడు.. మరి ఈ సినిమాతో సక్సెస్ ను దక్కించుకుంటాడా చూడాలి. అయినా సక్సెస్ లేకున్నా బ్యాక్ టు బ్యాక్ ఇలా ఎలా సినిమాలు దక్కించుకుంటున్నావు బాబు అంటూ కొందరు ఇండస్ట్రీ వర్గాల వారు మౌనంగా ప్రశ్నిస్తున్నారు.

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ
బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం
1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.
సంప్రదించండి
Tel No: 9849031420 ,9440918143, 94409 18371, 94400 53858, 93473 50692,8008840506, 9440077239, 7798832998, 76600 27678,
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com